teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 222 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 12 డిసెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## టీజీపీఎస్సీలో పలు సంస్కరణలకు శ్రీకారం

**ఈ నెల 18 ,19 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు టీజీపీఎస్సీ బృందం**



హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బుర్రా వెంకటేశం కమిషన్ పనితీరును మెరుగుపరిచేందుకు పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దీంట్లో భాగంగా ఈ నెల 18 ,19 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆయనతో పాటు కమిషన్ ప్రతినిధి బృందం ఢిల్లీలో పర్యటించనుంది. ఈ నెల 18న యూపీఎస్సీ, ఈ నెల 19న స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పనితీరుపై కమిషన్ బృందం అధ్యయనం చేయనుంది. ఈమేరకు బుధవారం టీజీపీఎస్సీ

మిగతా 2 లో




# మరో నెల రోజుల్లో స్థానిక ఎన్నికలు..?

ఎన్నికలు నిర్వహిచేందుకు సిద్ధమవుతున్న రేవంత్ సర్కార్

రాజకీయ వివాదాలను కంట్రోల్ చేసేందుకు బిగ్ స్కెచ్

ఎంపీటీసీల సంఖ్యను పెంచేందుకు సన్నాహాలు






తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం దిశగా అడుగులేస్తోంది. మరో నెల రోజుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న రేవంత్ సర్కార్. మండలాల్లో పెరుగుతున్న జనాభాతో పాటు రాజకీయ వివాదాలను

మిగతా 2 లో

# మనిషి ఆధార్ మాదిరిగానే ప్రతి ఆస్తికి భూదార్

**కొత్త ఆర్వోఆర్ చట్టంలో చేర్చిన భూదార్**





తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): భూ సమస్యల పరిష్కారానికి కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకువస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందులో భూదార్ ను చేర్చింది. ప్రతి మనిషి చిరునామా, గుర్తింపుని తెలిపే ఆధార్ మాదిరిగానే ప్రతి ఆస్తికి భూదార్ కార్డును జారీ చేయాలని నిర్ణయించింది. ఇది ప్రాపర్టీ అడ్రస్ ను చెబుతుంది. ఏ భూ సంస్కరణను తీసుకురావాలన్నా ఈజీగా అమలు చేసేందుకు వీలుగా ఈ యూనిక్ కోడ్ దోహదపడనున్నది. ఇప్పటి వరకు మాన్యువల్ రెఫరెన్స్ ని

మిగతా 2 లో

## సెక్రటేరియట్‌లో ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం

**ఈ సిస్టం మేరకే అటెండెన్స్ నమోదుకు సీఎస్ ఉత్తర్వులు**



హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సెక్రటేరియట్‌లో పని చేసే అధికారులు, ఉద్యోగులు, కింది స్థాయి సిబ్బంది గురువారం నుంచి ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా అటెండెన్స్ నమోదు చేయాలని సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఇష్టం వచ్చిన సమయానికి డ్యూటీలకు వచ్చి ఇష్టం వచ్చిన సమయానికి వెళ్లిపోతున్నారనే ఆరోపణల నేపథ్యంలో

మిగతా 2 లో



## ప్రజాపాలన దరఖాస్తులపై మంత్రి పొంగులేటి సమీక్షా

హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల అప్లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి ముఖ్య కార్యదర్శి శాంతకుమారి, ప్రభుత్వ సలహాదారు వేమ నరేందర్ రెడ్డిలతో కలిసి ప్రజా పాలనలో వచ్చిన ఇండ్ల దరఖాస్తుల యాప్ అప్లోడ్ ప్రక్రియ, వసతి గృహాల్లోని వసతులు, గ్రూప్-2 పరీక్షల నిర్వహణ, వసతి

మిగతా 2 లో

## పాఠ్యపుస్తకాల్లో రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి చిత్రం ముద్రన

**విద్యార్థుల్లో రాష్ట్రాభిమానం పెంపొందించేందుకు నిర్ణయం**

**సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం నిర్ణయం**

హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల్లో రాష్ట్రాభిమానం పెంపొందించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణను, తెలంగాణ తల్లి చిత్రాన్ని పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్ర భావజాలాన్ని విద్యార్థులలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుండి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అన్ని పాఠ్యపుస్తకాల్లో ఈ కొత్త మార్పులు అమలు కానున్నాయి. ప్రస్తుత పాఠ్యపుస్తకాల్లో ప్రతిజ్ఞతోపాటు జాతీయ గీతం, జాతీయ

మిగతా 2 లో





## సివిల్స్ మెయిన్స్ కు హాజరైన అభ్యర్థులకు సర్కార్ భరోసా

రాజీవ్ అభయహస్తం

కింద రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం

అభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): యూపీఎస్సీ మెయిన్స్ 2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది తొలి సారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక

మిగతా 2 లో



## గ్రూప్- 2 పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

పరీక్ష సెంటర్ల వద్ద పకడ్బందీ చర్యలు

ఇప్పటికే అందుబాటులోకి హాల్ టికెట్లు

జిల్లాల వారీగా హెల్ప్ లైన్ నంబర్లు

హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): గ్రూప్- 2 పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు సిద్ధం చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగే ఈ పరీక్షల కోసం సెంటర్ల వద్ద పకడ్బందీ చర్యలను చేపట్టనుంది. మరోవైపు ఇప్పటికే హాల్ టికెట్లను కూడా

మిగతా 2 లో



## జర్నలిస్టుపై మోహన్ బాబు దాడిపై స్పందించిన మంత్రి పొన్నం

**వ్యక్తిగత పంచాయతీలో జర్నలిస్టుపై దాడి సరికాదు**

**తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): కవరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్టులపై ప్రముఖ నటుడు మోహన్ బాబు దాడి చేసిన విషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు టాలీవుడ్‌లో ఈ వ్యవహారం దుమారం రేపుతోంది. జర్నలిస్టుల పట్ల అహంకార పూరితంగా వ్యవహరించిన మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని

మిగతా 2 లో



## సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశరావు ఫైర్

మార్చాల్సింది విగ్రహాలు కాదు.. ప్రజల బతుకులు

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన హరీశ్

హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్ అయ్యారు. మార్చాల్సింది విగ్రహాలు కాదు. ప్రజల బతుకలని

మిగతా 2 లో

## దేశ భవిష్యత్తుకు యువ ఆవిష్కర్తలు కీలకం

**లక్షలాది మంది జీవితాలను మార్చగలవు : ప్రధాని మోదీ**



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): దేశం పెద్ద ఎత్తున డిజిటల్‌గా కనెక్ట్ అవుతున్నందున, సైబర్‌క్రైమ్‌ల ముప్పు కూడా నిరంతరం పెరుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం హైలైట్ చేశారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 యొక్క గ్రాండ్ ఫినాలేలో యువ ఆవిష్కర్తలతో జరిగిన ఇంటరాక్షన్‌లో, భారతదేశం

మిగతా 2 లో



## అన్నింటికి రాజకీయ రంగు పులమడం మంచికాదు

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల మంత్రి ఉత్తమ్ వాఖ్యలు**

హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ తరగతులను బీఆర్ఎస్ బాయ్ కాట్ చేయడం సరికాదన్నారు. అన్నింటికి రాజకీయ

మిగతా 2 లో

# మరో నెల రోజుల్లో స్థానిక ఎన్నికలు..?



మొదటి పేజీ తరువాయి

కంట్రోల్ చేసేందుకు బిగ్ స్కెచ్ వేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 540 గ్రామీణ మండలాలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పరచిన మరో మూడు మండలాల్లోనూ ఎంపీటీసీల సంఖ్యను పెంచేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఇందుకు సంబంధించి చట్ట సవరణ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## 22 మండలాలకు ముగ్గురు లేదా నలుగురు

ప్రస్తుతం 22 మండలాలకు ముగ్గురు లేదా నలుగురు ఎంపీటీసీలు మాత్రమే ఉన్నారు. ఒకరు ఎంపీపీ మరొకరు వైస్ ఎంపీపీగా ఎన్నికైతే మిగిలిన సభ్యులతో సమావేశాలు నిర్వహించడం క్లిష్టంగా మారడం, రాజకీయంగా గొడవలకు దారితీస్తున్నాయి. సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం తలనొప్పిగా మారింది. దీంతో వీటిని అరికట్టేందుకు ప్రతి మండలంలో 5గురు ఎంపీటీసీలు ఉండేలా కసరత్తులు చేస్తోంది.
3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతానికి ఒక ఎంపీటీసీ ప్రాతినిథ్యం వహిస్తుండగా ఇకపై 3 వేల కంటే తక్కువ జనాభా ఉన్న ప్రాంతాన్ని సైతం ఎంపీటీసీ నియోజకవర్గంగా చేయాలని భావిస్తోంది. 5 వేల కన్నా ఎక్కువ జనాభా ఉన్న గ్రామానికి రెండు ఎంపీటీసీ స్థానాలకు పెంచాలని యోచిస్తోంది. ముగ్గురు ఎంపీటీసీలు ఉన్న మండలంలో ఎంపీపీ పదవి కోసం ఇద్దరు ఎంపీటీసీలు ఏకమైతే ఒకరు ఎంపీపీ, మరొకరు వైస్ ఎంపీపీ ఎన్నికయ్యేవారు. మిగిలిన ఒక ఎంపీటీసీకి అంశాల వారీగా మద్దతు లభించేంది. నలుగురు ఎంపీటీసీలు ఉన్న మండలాల్లోనూ సరైన సమన్వయం ఉండట్లేదని భావించిన రేవంత్ సర్కార్ కొత్త విధానాన్ని తీసుకొస్తున్నట్లు సమాచారం.

# సివిల్స్ మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థులకు సర్కార్ భరోసా



మొదటి పేజీ తరువాయి

సాయం అందించింది. సివిల్స్ సాధించే లక్ష్యంతో ప్రిపేరయ్యే పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ఈ ఏడాది తొలిసారిగా అమలు చేసింది. సింగరేణి సంస్థ అధ్వర్యంలో 135 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది ఆగస్ట్ 26న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వీరికి చెక్కులు పంపిణీ చేశారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 20 మంది తాజాగా యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన ఈ. సాయి శివాని, రాహుల్ శంకేషి, పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి, ఖమ్మం జిల్లాకు చెందిన నల్లమల సాయికుమార్, బానోతు నాగ రాజా నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కదారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి, మెదక్ జిల్లాకు చెందిన కుమ్మరి శ్రవణ్ కుమార్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బెస్త ప్రియాంజలి, సిద్ధిపేటకు చెందిన నరిగె స్వామి, నాగర్‌కర్నూలుకు చెందిన గోకమల్ల అంజనేయులు, ఆదిలాబాద్‌కు చెందిన ఆర్. ప్రమోద్ కుమార్, వికారాబాద్‌కు చెందిన బి. ప్రహ్లాద్, జగిత్యాలకు చెందిన బురుగుపెల్లి నీరజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జస్వంత్ కుమార్, అసిఫాబాద్-కుమ్రంభీం జిల్లాకు చెందిన రామ్టెంకి సుధాకర్ మెయిన్స్ క్వాలిఫై అయిన జాబితాలో ఉన్నారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

# ప్రజాపాలన దరఖాస్తులపై మంత్రి పొంగులేటి సమీక్షా

మొదటి పేజీ తరువాయి

గృహాల్లో డైట్ చార్జీల పెంపు అమలు పై జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజపాలనలో ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారికి అదేవిధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. అధికారులు ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులైన వారి వివరాలను అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు. గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచినందున డిసెంబర్ 14న అన్ని కేంద్రాల్లో కొత్త మెనూతో భోజనాన్ని ప్రారంభించాలని మంత్రి తెలిపారు.

# టీజీపీఎస్సీలో పలు సంస్కరణలకు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి



చైర్మన్ బుర్రా వెంకటేశం యూపీఎస్సీ చైర్‌పర్సర్ ప్రీతి సూడాన్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ చైర్మన్ ఎస్ గోపాలకృష్ణన్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మరింత విస్తృత చర్చల కోసం ఢిల్లీకి వస్తామని చెప్పగా ఇందుకు వారు అంగీకరించారు. ఈ పర్యటనలో భాగంగా పరీక్షావిధానం, మూల్యాంకన ప్రక్రియ, ఎంపిక విధానాల్లో రెండుసంస్థలు అనుసరిస్తున్న పారదర్శక విధానాలను అధ్యయనం చేయనున్నారు.

# గ్రూప్- 2 పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

మొదటి పేజీ తరువాయి



అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు టీజీపీఎస్సీ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

**జిల్లాల వారీగా హెల్ప్ లైన్ నంబర్లు**

అభ్యర్థుల ఇబ్బందులను నివృత్తి చేసేందుకు జిల్లాల వారీగా హెల్ప్ లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఫోన్ నెంబర్లతో కూడిన జాబితాను వెబ్ సైట్ లో విడుదల చేసింది. ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యప్తంగా 1368 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ సమయంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు వస్తే 040-23542185 లేదా 040-23542187 నంబర్లకు సంప్రదించవచ్చు. %నవశ్రీజూనవంనెవ్ంజూంఎ.స్త్రశీజ.ఱఅ% ఈ-మెయిల్ సందేహాలు పంపవచ్చని టీజీపీఎస్సీ పేర్కొంది.

**గ్రూప్ 2 పరీక్షలు - టైమ్ టేబుల్**

గ్రూప్-2 ఎగ్జామ్ లో భాగంగా మొత్తం 4 పేపర్లు ఉంటాయి. టీజీపీఎస్సీ నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పేపర్-1 డిసెంబరు 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 ఉంటుంది. ఇక డిసెంబరు 16వ తేదీన పేపర్ 3, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్-2 ప్రతి పేపరులో 150 ప్రశ్నలు 150 మార్కులకు నిర్వహించనున్నారు.

# జర్నలిస్టుపై మోహన్ బాబు దాడిపై స్పందించిన మంత్రి పొన్నం

మొదటి పేజీ తరువాయి

పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. మోహన్ బాబు, మంచు మనోజ్ వ్యక్తిగత పంచాయతీలో జర్నలిస్టుపై దాడి సరికాదని అన్నారు. దాడి ఘటనపై విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా, మంచు ఫ్యామిలీలో నెలకొన్న విభేదాలు గత నాలుగు రోజులుగా పీక్ స్టేజ్‌కు చేరాయి. మంగళవారం రాత్రి జల్ పల్లిలోని మోహన్ బాబు నివాసానికి ఆయన కుమారుడు మంచు మనోజ్ వెళ్లడంతో ఉద్రిక్తలు మరింత ఎక్కువ అయ్యాయి. మనోజ్ ను ఇంట్లోకి రానివ్వకుండా గేట్స్ క్లోజ్ చేసి అడ్డుకున్నారు మోహన్ బాబు సెక్యూరిటీ సిబ్బంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మనోజ్ గేట్లు తోసుకుని ఇంటి లోపలికి వెళ్లాడు. మోహన్ బాబు ఇంటి వద్ద జరుగుతోన్న ఈ ఫ్యామిలీ ఫైట్‌ను కవరేజ్ చేసేందుకు మీడియా అక్కడికి వెళ్లింది. మీడియా ప్రతినిధులు ఇంట్లోకి రావడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మోహన్ బాబు కోపంలో జర్నలిస్టుపై దాడి చేశాడు. జర్నలిస్టు చేతిలో ఉన్న మైక్ ను తీసుకుని తలపై కొట్టాడు. ఈ ఘటనలో జర్నలిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. అహంకార ధోరణితో జర్నలిస్ట్ పై దాడి చేసిన మోహన్ బాబుపై జర్నలిస్టు సంఘాలు భగ్గుమన్నాయి. మోహన్ బాబు మీడియాకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఫిల్మ్ ఛాంబర్ ఎదుట ఆందోళన చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

మొదటి పేజీ తరువాయి



విమర్శించారు. రేవంత్ రెడ్డి ఏనాడు తెలంగాణ అని అనలేదు. ఉద్యమంలో పాల్గొనలేదన్నారు. రాజీనామా చేయలేదన్నారు. రేవంత్ తెలంగాణ ద్రోహి అని మండిపడ్డారు. తెలంగాణ వచ్చిందంటే దానికి కారణం కేసీఆర్ అని అన్నారు హరీశ్. గ్రామాల్లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలను రేవంత్ రెడ్డి ఇప్పుడు తొలగిస్తారా? అని ప్రశ్నించారు. 2015 జూన్ 2న సంగారెడ్డి కలెక్టరేట్ లో మొదటి సారి అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టామన్నారు హరీశ్ రావు. 2023 జూన్ 22 న నాడు సెక్రటేరియట్ దగ్గర కేసీఆర్ తెలంగాణ తల్లి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. తెలంగాణలో ఉన్న తెలుగుతల్లి విగ్రహాన్ని ఎవరైనా మార్చారా అని ప్రశ్నించారు. కేసీఆర్ 2001లో పార్టీ పెట్టకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు హరీశ్ రావు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన, 16 ఏళ్ల టీడీపీ పాలనలో తెలంగాణ అనే పదం లేకుండా చేశారని విమర్శించారు. 2004 నుంచి 2009 వరకు తమతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇవ్వకుండా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 ప్రకటన లేదు. జూన్ 2 లేదన్నారు హరీశ్ రావు.

# అన్నింటికి రాజకీయ రంగు పులమడం మంచికాదు

మొదటి పేజీ తరువాయి

రంగు పులమడం మంచిది కాదని దుయ్యబట్టారు. బుధవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ తరగతుల సందర్భంగా ఓ మీడియా చానల్ తో మాట్లాడిన ఉత్తమ్ రాజీవ్ గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహం తొలిగించే అవకాశం బీఆర్ఎస్ కు రాదన్నారు.
ఈ రాష్ట్రంలో మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ, కౌన్సిల్ ప్రజాస్వామ్యానికి దేవాలయాల వంటివని నీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఒక పద్ధతి ప్రకారం ప్రవర్తించాలన్నారు. రానురాను ఈ వ్యవస్థల పట్ల గౌరవం తగ్గుతున్నదని సభ్యులు హాజరు, సభలు సాగుతున్న రోజులు తగ్గుతున్నాయని ఇది మంచి పరిణామం కాదన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఇంత స్థాయిలో మిగిలింది మన దేశంలోనేనని దీన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లకు స్పోర్ట్స్ గ్రౌండ్ కచ్చితం

**ఈ మేరకు నిబంధన పెడుతున్నాం**

**తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్**



హైదరాబాద్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): ప్రైవేట్ స్కూళ్లలో స్పోర్ట్స్ గ్రౌండ్ కచ్చితంగా ఉండాలని, ఒకవేళ సొంతంగా లేకపోతే అద్దె మైదానం ఉండాలని నిబంధన పెడుతున్నామని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ హయాంలో క్రీడలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి స్వతహాగా క్రీడా ప్రేమికుడు, క్రీడాకారుడు. క్రీడలకు కనీవినీ ఎరుగని స్థాయిలో నిధులు కేటాయించారు. ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్, బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడలు, హాకీ ఇలా అనేక స్పోర్ట్స్‌నిర్వహిస్తున్నం. గ్రామీణ స్థాయి నుంచి ప్లేయర్లను తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నం. ఒలింపిక్స్ లో ఉన్న 38 రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తున్నం. హైదరాబాద్ లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నం. ఇందుకోసం ఆస్ట్రేలియా క్వీన్స్ ల్యాండ్ వెళ్లి అధ్యయనం కూడా చేసి వచ్చాం. కేంద్రంలో మన్సుఖ్ మండవియా, పీటీ ఉషను కలిసి నేషనల్ గేమ్స్ తెలంగాణలో నిర్వహించాలని కోరాం. పాఠశాలల్లో స్పోర్ట్స్ ఫ్యాకల్టీ ఉండేలా చూస్తాం. పీఈటీ ఖాళీలు భర్తీ చేస్తం అని తెలిపారు.

# మనిషి ఆధార్ మాదిరిగానే ప్రతి ఆస్తికి భూదార్

మొదటి పేజీ తరువాయి

క్రియేట్ చేశారు. కొత్త చట్టం ద్వారా జియో ట్యాగ్స్ తో ప్రాపర్టీని గుర్తించే వీలవుతుంది. దీంతో ఇప్పటి దాకా రైతుకు మాత్రమే ఉండే యూనిక్ నంబర్ ను ఇక ప్రతి ప్రాపర్టీకి ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో అక్రమాలకు చెక్ పడడమే కాకుండా ఆస్తికి సరైన గుర్తింపు ఇస్తూ భూమి, ఆస్తి హక్కుదారులకు తోడ్పాటు అందుతుంది.

**కేంద్రం సూచనలకు అనుగుణంగా**

దేశంలో రైతులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు వీలుగా ఆధార్ తరహా కార్డుల జారీకి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నమోదు వ్యవస్థను నెలకొల్పాలని ఆదేశించింది. రాష్ట్రాల్లో రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం, వివిధ శాఖలతో సమన్వయం చేసేందుకు ప్రాజెక్టు నిర్వహణ యూనిట్ (పీఎంయూ)ని ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించింది. దేశంలో 19 రాష్ట్రాలు కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అందులో తెలంగాణ కూడా కేంద్రం సూచనలకు అనుగుణంగా పీఎంయూని ఏర్పాటు చేసింది. దీనికి హెడ్ గా వ్యవసాయ సంచాలకులు బి.గోపి, సభ్యులుగా సీసీఎల్ఏ కార్యదర్శి మంద మకరందం, ఐటీ శాఖ డిప్యూటీ కార్యదర్శి భవేశ్ మిశ్రా, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు సర్వేశ్వర్ రెడ్డి, ఐటీ శాఖ సీనియర్ సంచాలకులు రాధాకృష్ణలను నియమించింది. రైతుల వారీగా పంటలు, పశు సంపద వంటి సమస్త సమాచారం కేంద్రానికి అందుతుంది. పంటలను రైతులు కనీస మద్దతు ధరకు అమ్ముకోవడానికి, ఇతర లావాదేవీలకు వీలుగా కూడా ఇది ఉండాలని కేంద్రం భావిస్తున్నది.

# సెక్రటేరియట్‌లో ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం

మొదటి పేజీ తరువాయి

ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టం తీసుకువచ్చారు. సెక్రటేరియట్‌లోకి ఎంట్రీ అయ్యే అన్ని పాయింట్ల వద్ద ఈ పరికరాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఫేక్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అధికారులు, ఉద్యోగులు, రెగ్యులర్ స్టాఫ్‌తో పాటు సెక్రటేరియట్ హెడ్ ఆఫ్ ఎకౌంట్స్ నుంచి జీతాలు చెల్లించే ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారానే హాజరు నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పాఠ్యపుస్తకాల్లో రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి చిత్రం ముద్రన

మొదటి పేజీ తరువాయి

గేయం మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు వీటితో పాటు రాష్ట్రగీతం, తెలంగాణ తల్లి ఫొటో కూడా చేర్చడం ప్రత్యేకతగా మారనుంది. ఈ నిర్ణయంపై స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి పాత సిలబస్ కొనసాగుతుందని, 2026-27లో కొత్త సిలబస్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది' అని తెలిపారు. కొత్త సిలబస్‌లో రాష్ట్ర చరిత్ర, సంస్కృతి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రగీతం, తెలంగాణ తల్లి ఫొటో విద్యార్థులపై సానుకూల ప్రభావం చూపుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్ని పెంపొందించడంలో ఈ చర్య ఒక పెద్ద అడుగు అని చెబుతున్నారు. విద్యార్థులు రాష్ట్ర చరిత్ర, సంప్రదాయాల పట్ల మరింత అవగాహనతో ఎదుగుతారని ఆశిస్తున్నారు. ఈ కొత్త మార్పులు ప్రభుత్వ తీరును ప్రతిబింబిస్తాయని, విద్యావ్యవస్థలో తెలంగాణ ప్రత్యేకతను నిలబెట్టే దిశగా ఇది ఒక ముఖ్యమైన ప్రయత్నమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# దేశ భవిష్యత్తుకు యువ ఆవిష్కర్తలు కీలకం

మొదటి పేజీ తరువాయి

ప్రపంచంలోని అగ్రగామి డిజిటల్ ఆర్థిక వ్యవస్థలలో ఒకటి అని ప్రధాని అన్నారు. యువ ఆవిష్కర్తలను ప్రశంసిస్తూ, వారందరికీ 21వ శతాబ్దపు భారతదేశం పట్ల భిన్నమైన దృక్పథం ఉందని ప్రధాని అన్నారు. భారతదేశ భవిష్యత్తుకు వారి పరిష్కారాలు చాలా కీలకమని, లక్షలాది మంది జీవితాలను మార్చగలవని ఆయన అన్నారు. అందరి సమిష్టి కృషితోనే నేటి భారతదేశం శరవేగంగా ముందుకు సాగుతుందని కూడా మోదీ పునరుద్ఘాటించారు. యువ ఆవిష్కర్తలతో సన్నిహితంగా ఉండే అవకాశం వచ్చినప్పుడల్లా చాలా కొత్త విషయాలను నేర్చుకుంటానని, అర్థం చేసుకుంటానని పేర్కొన్నాడు. దేశం కొత్త సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు, యువ ఆవిష్కర్తలు అసాధారణ పరిష్కారాలతో ముందుకు వస్తారని కూడా ఆయన హైలైట్ చేశారు. వారి సహకారాన్ని మెచ్చుకున్న ప్రధాన మంత్రి, ఈ ఆవిష్కర్తలు తనను ఎన్నడూ నిరాశపరచలేదని, బదులుగా తన మనోధైర్యాన్ని పెంచారని అన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ యొక్క గత బృందాలు అందించిన పరిష్కారాలను ఇప్పుడు వివిధ మంత్రిత్వ శాఖలు ఉపయోగించుకుంటున్నాయని, దేశవ్యాప్తంగా గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయని ఆయన నొక్కిచెప్పారు. ప్రతి బిడ్డ ప్రత్యేకమైనవారని, ఎదగడానికి మరియు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని ప్రధాన మంత్రి ఉద్ఘాటించారు. ఎవరూ వెనుకబడి ఉండకూడదని లేదా మినహాయించబడ్డారని అతను నొక్కి చెప్పాడు. దీనిని సాధించడానికి, వినూత్న పరిష్కారాలు నిరంతరం అవసరమని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో డ్రోన్‌లు విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయని ప్రధాన మంత్రి హైలైట్ చేశారు. నమో డ్రోన్ దీదీ పథకాన్ని ప్రస్తావిస్తూ, సుదూర ప్రాంతాలకు మందులు మరియు నిత్యావసర వస్తువులను డెలివరీ చేయడానికి ఇప్పుడు డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారని మోదీ అన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## రూట్ మారిన పాలిటిక్స్...

డిటిజల్ యుగంలో ఆన్ లైన్ మోడ్ సౌలభ్యంగా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాజకీయాలు సైతం ఆన్ లైన్ అంటే సోషల్ మీడియా బాట పడుతున్నాయి. ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టేందుకు రాజకీయ పార్టీల సోషల్ మీడియాను ఒక అస్త్రంలా వాడుతున్నాయి. ఒకప్పుడు రాజకీయాలంటే మైకుల మందు గంటల కొద్దీ వాదనలు, టీవీ డిబెట్లు. ఇప్పుడు పాలిటిక్స్ మోడ్ మార్చాయి. డిజిటల్ యుగంలో పాలిటిక్స్ సోషల్ మీడియా మార్గాన్ని ఎంచుకున్నాయి. సాంకేతికత అభివృద్ధితో సార్ట్ ఫోన్ నేటి ప్రపంచాన్ని రూల్ చేస్తుంది. ఏది కావాలన్న క్షణాల్లో మన ముందుకు తెస్తుంది. సార్ట్ ఫోన్ల వాడకం పెరగడం, సోషల్ మీడియా విస్తరణతో పాలిటిక్స్ రూటు మార్చాయి. సోషల్ మీడియా రాజకీయాలకు తెరలేపాయి. ఇందుకు ప్రత్యేకంగా సోషల్ మీడియా కార్యకర్తలను సిద్ధం చేసుకుంటున్నాయి. తమ మద్దతుదారులతో సోషల్ మీడియా బృందాలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఏ చిన్న సంఘటన జరిగినా క్షణాల్లో ప్రజలకు తెలిసేలా చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, జనసేన... ఇప్పటికే సోషల్ మీడియాలో బలంగా ఉన్నాయి. విషయం ఏదైనా క్షణాల్లో వైరల్ చేయగల ప్రత్యేకగా ఈ పార్టీలకు, వీరి మద్దతుదారులకు ఉంది. గ్రామాల నుంచి దేశ రాజధాని వరకు పార్టీ పరంగా జరిగే కార్యక్రమాల నుంచి అధికార పార్టీలను ఇరకాటంలో నెట్టే సమాచారం వరకు క్షణాల్లో వైరల్ చేస్తుంటాయి. తాము ఎంచుకున్న అంశాన్ని దేశవ్యాప్తంగా ట్రేడింగ్ లోకి తీసుకువస్తుంటాయి. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణే ఇటీవల జరిగిన తెలుగు రాష్ట్రాల ఎన్నికలు, ఆ తర్వాత పరిస్థితులు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించిందనే చెప్పాలి. విషయం ఏదైనా తమకు అనుకూలంగా మార్చుకుని క్షణాల్లో పోస్టులను వైరల్ చేస్తూ... ప్రజలను మభ్యపెట్టడంలో సోషల్ మీడియాకు ప్రత్యేకత ఉంది. తెలంగాణ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ సోషల్ మీడియా పాలిటిక్స్ జోరుగా సాగించాయి. అయితే ఈ విషయంలో కాస్త వెనుక బడిన బీఆర్ఎస్... ఎన్నికల్లో పరాజయాన్ని చూసింది. కాంగ్రెస్ హామీలు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై వ్యతిరేకతను సోషల్ మీడియా ద్వారా ప్రతి ఇంటికి చేర్చి హస్తం పార్టీ విజయం సాధించింది. ఇప్పుడు బీఆర్ఎస్ ఇదే ఫార్ములాను వాడుతోంది. కాంగ్రెస్ అధికారం చేపట్టినప్పటి నుంచి అదే సోషల్ మీడియాతో.... కాంగ్రెస్ ను ముప్పు తిప్పలు పెడుతోంది బీఆర్ఎస్. చిన్నపాటి నిరసన నుంచి అరెస్టులు, ఆందోళన, అధికార కాంగ్రెస్ చర్యలు, ప్రభుత్వ నిర్ణయాలు ఇలా ప్రతి అంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా పాలిటిక్స్ చేస్తుంది. ఇక ఏపీలో టీడీపీ, వైసీపీ, జనసేనకు స్ట్రాంగ్ సోషల్ మీడియా వింగ్స్ ఉండడంతో...వీటి మధ్య ఏ విషయమైన హోరాహోరీగా ఉంటుంది. ఏ విషయానైనా రాజకీయంగా ముడిపెడుతూ... లబ్దిపొందేందుకు రాజకీయ పార్టీలు సోషల్ మీడియా పాలి(టిక్స్ చేస్తు?న్నాయని నిపుణులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు సోషల్ మీడియా ఎప్పుడో వేదికై పోయింది. ఏపీ రాజకీయాల్లో పొలిటికల్ కన్సల్టెంట్ల ప్రయేయం మొదలయ్యాక అధికారాన్ని చేరుకోడానికి, అధికారాన్ని నిలబెట్టుకోడానికి సోషల్ మీడియానే వేదికగా మారింది. ముసుగు ముఖాలతో సోషల్ మీడియాలో చేసే ప్రచారమే పార్టీలకు ఊపిరి పోస్తోంది. అన్ని పార్టీలు కొన్నేళ్లుగా ఇదే పంథాలో పయనిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న వైసీపీ వేగంగా తేరుకున్నట్టు కనిపిస్తోంది. నెలన్నర లోపే వైసీపీ సోషల్ మీడియా ఖాతాలను ఆ పార్టీ యాక్టివేట్ చేసుకుంది. మొదట్లో కొన్నాళ్లు తాడేపల్లిలోని జగన్ నివాసం సమీపంలోని విల్లాల్లో ఆ పార్టీ సోషల్ మీడియా కార్యకలాపాలను నిర్వహించారు. పోలీస్ కేసులు, సాంకేతిక కారణాలతో మరో ప్రాంతానికి తమ బృందాలను ఆ పార్టీ తరలించేసింది. అధికారానికి దూరమైన తర్వాత వైసీపీ అధ్యక్షుడు తరచూ బెంగుళూరు వెళ్లిపోతున్నా పార్టీ శ్రేణులకు, గతంతో పోలిస్తే వీలైనంత ఎక్కువగానే అందుబాటులో ఉంటున్నారు. మొదట్లో పార్టీ కార్యకర్తల ఆందోళనలు, నిరసన స్వరాలు వినిపించడంతో కార్యకర్తలతో కలవడానికి కూడా ఆ పార్టీ అధినేత విముఖత చూపించారు. పార్టీ శ్రేణుల్ని కలిసే కార్యక్రమాలకు స్వస్తి పలికారు.?ఆ తర్వాత అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చే వీడియోలు, పోస్టులు పూర్తిగా నమ్మే ప్రసక్తి లేదంటున్నారు. రాజకీయ పార్టీల మద్దతుదారులు తమకు అవసరమైన కొద్ది సమాచారాన్ని మాత్రమే ట్రిమ్ చేసి వీడియోలు పోస్టు చేస్తుంటాయని అంటున్నారు. అయితే ఇటీవల కాలంలో సోషల్ మీడియా విస్తరించడంతో... ప్రజలను మభ్యపెట్టే అవకాశం లేకపోలేదంటున్నారు. అందుకే రాజకీయ పార్టీలు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రాజకీయాలు సార్ట్ చేశాయని, ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సోషల్ మీడియా పోస్టులు ఓట్లు రాలుస్తాయా? అంటే ఒకింత ప్రభావం చూపుతాయని అభిప్రాయపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలు సేకరించాలి

**- రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**- ప్రతి 500 ఇండ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనకు ఒక సర్వేయర్ నియామకం**

**- పకడ్బందీగా గ్రూప్ 2 పరీక్షల నిర్వహించాలి డిసెంబర్ 14 న డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవము**

హనుమకొండ జిల్లా, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 80 లక్షల మంది వివరాలను డిసెంబర్ నెలాఖరు లోగా పకడ్బందీగా సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ లోని సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ, నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవం కార్యక్రమం, సంక్షేమ హాస్టల్స్ తనికి, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన నేపథ్యంలో మనం చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ డిసెంబర్ 9 వరకు ఘనంగా నిర్వహించిన వేడుకలకు మరియు సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ మరియు కుల సర్వే ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా పూర్తి చేసిన నందులకు జిల్లా కలెక్టర్లను, అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. డిసెంబర్ 5న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల యాప్ ప్రారంభించుకున్నామని అన్నారు. ప్రజాపాలన ద్వారా మనకు సుమారు 80 లక్షల వరకు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు వచ్చాయని, ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా 80 లక్షల దరఖాస్తులకు సంబంధించి సంపూర్ణ వివరాలు డిసెంబర్ నెలాఖరు లోపు సేకరించాలని, ప్రతి 500 ఇండ్ల దరఖాస్తుల సర్వే కోసం ఒక సర్వేయర్ ను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పంచాయతీలలో, మున్సిపాలిటీలలో, కార్పొరేషన్లలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను నియమించామని, వీరిని సమన్వయం చేసుకుంటూ వివరాల సేకరణ జరగాలని, షెడ్యూల్ ముందస్తుగానే ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రజలకు తెలియజేయాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం మనం ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా సేకరించే డేటా రాబోయే 4 సంవత్సరాలు ఉపయోగ పడుతుందని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పక్కాగా వివరాల సేకరణ ఉండాలని అన్నారు. ఈ సర్వేలో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫోటో నమోదు చేయాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిల్లలకు అందించే డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమంతో పాటు ఈ విద్యా సంస్థలను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని, ఈ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించే దిశగా కృషి చేయాలని అన్నారు. హాస్టల్స్ కు సన్న రకం బియ్యం సరఫరా చేస్తున్నామని, ఇందులో అధికంగా నూక వస్తుందని ఫిర్యాదులు ఉన్నాయని వీటిని పరిశీలించి కలెక్టర్లు నాణ్యమైన బియ్యం, విద్యాసంస్థలకు చేరేలా చూడాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ ప్రజా పాలన ద్వారా సేకరించిన దరఖాస్తులలో ఇందిరమ్మ ఇండ్ల కింద ప్రభుత్వానికి 80 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సర్వేయర్ ద్వారా ఇంటింటికి తిరుగుతూ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ప్రతి 500 ఇండ్ల దరఖాస్తులు సర్వే కొసం ఒక సర్వేయర్ చొప్పున సర్వే చేసేందుకు అవసరమైన సిబ్బంది గుర్తించి వారికి శిక్షణ కార్యక్రమం 2 రొజులలో పూర్తి చేయాలని అన్నారు. సర్వే కోసం నగరంలోని వార్డు అధికారులు, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్, రూరల్ ప్రాంతాల్లో గ్రామస్థాయి సిబ్బంది సర్వేయర్ లుగా నియమించాలని అన్నారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొసం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు యాప్ ద్వారా సిబ్బంది వివరాల సేకరణకు వస్తున్నారని ముందస్తు సమాచారం అందించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం నూతన దరఖాస్తులు తీసుకోవడానికి వీలు లేదని, పాత దరఖాస్తుల పరిశీలన కొసం మాత్రమే సర్వే చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రతి సర్వేయర్ రొజుకు 20 ఇండ్ల దరఖాస్తుల సర్వే పూర్తి చేయాలని అన్నారు. గ్రూప్ 2 పరీక్షలను ఎటువంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్ శాంతి కుమారి అధికారులకు సూచించారు. డిసెంబర్ 14న జిల్లాలలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, మాడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవి లో 40% డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని, ముఖ్యంగా తల్లి హాజరయ్యే విధంగా చూసుకోవాలని అన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం జరగాలని, ఆ రోజు విద్యార్థులకు స్పెషల్ ఆహారం అందించాలని, ప్రతి విద్యా సంస్థలు మెన్యు కు సంబంధించి వివరాల ఫ్లెక్సీ ప్రచురణ చేయాలని అన్నారు. పాఠశాలల్లో వంట గది నిర్వహణ, పిల్లలకు అందించాల్సిన నాణ్యమైన ఆహారం తదితర అంశాలపై స్టాఫ్ కు అవగాహన కల్పించాలని అన్నారు. డైట్ చార్జీల పెంపు కార్యక్రమంలో మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు పోలీసు ఉన్నతాధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు ఉన్నతాధికారులు పాల్గొనేలా చూడాలని సీఎస్ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ గ్రూప్ 1, గ్రూప్ 3 పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని, ఈ సంవత్సరం చివరగా గ్రూప్ 2 పరీక్షలను డిసెంబర్ 15, 16వ తేదీలలో 2 సెషన్స్ లలో జరుగుతాయని అన్నారు. గ్రూప్ 2 పరీక్షలలో అభ్యర్థులకు ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్ అందించడం జరుగుతుందని అన్నారు. గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ సంబంధించి చేసిన ఏర్పాట్లను, పాటించాల్సిన నియమాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి పరీక్ష చాలా కీలకమని, ఎక్కడ ఎటువంటి చిన్న పొరపాటు జరగకుండా పకడ్బందీగా పరీక్షను నిర్వహించాలని చైర్మన్ కలెక్టర్లను కోరారు. ప్రతి అభ్యర్థికి ఓఎంఆర్ షీట్ ప్రత్యేకంగా ఉన్నందున పరీక్ష హాలలో అభ్యర్థి రాకపోయినా అతని స్థానంలో ఓఎంఆర్ షీట్ ప్రశ్నాపత్రం అలాగే పెట్టాలని, ఒకరి ఓఎంఆర్ షీట్ మరొకరికి ఇవ్వడానికి వీలు లేదని, పరీక్షా కేంద్రాలకు అభ్యర్థుల సకాలంలో చేరుకునేలా ముందుగానే విస్తృత ప్రచారం జిల్లాలలో కల్పించాలని, పరీక్ష సమయాలు, గేటు ఏ సమయంలో మూసి వేస్తాం వాటి అంశాలు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి వై. వి. గణేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేత

**- గ్రూప్-2 పరీక్షకు 16 కేంద్రాల్లో 5471 మంది అభ్యర్థులు**

**-అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ జిల్లా, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): జిల్లాలో గ్రూప్ - 2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్లి గ్రూప్ - 2 పరీక్ష నిర్వహణ, బయోమెట్రిక్ విధానంపై చీఫ్ సూపరింటెండెంట్ లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు, డిపార్టుమెంటల్ అధికారులు, లోకల్, జాయింట్ రూట్ అధికారులు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ (783) గ్రూప్-2 పోస్టులకు గాను నాలుగు పేపర్ల వారీగా ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్ - 1 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ - 2 పరీక్ష, అలాగే 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్ - 3 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ - 4 పరీక్ష జరగనుందని తెలిపారు. జిల్లాలో మొత్తం (5471) మంది అభ్యర్థులు (16) పరీక్ష కేంద్రాల్లో ఈ గ్రూప్-2 పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. అలాగే చీఫ్ సూపరిం టెండెంట్ లు (16), డిపార్ట్మెంటల్ అధికారులు (16), అబ్జర్వర్ లు (16), ఫ్లయింగ్ స్క్వాడ్ లు (5),బయోమెట్రిక్ అధికారులు (43), ఐడెంటిఫికేషన్ అధికారులు (52), నాలుగు రూట్లలో నలుగురు లోకల్, జాయింట్ రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. వంద శాతం బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష హాల్లో పరీక్ష ప్రారంభానికి ముందే ఓఎంఆర్ షీట్ పై ఇన్విజిలేటర్ లు పరీక్షార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఓఎంఆర్ షీట్ లో అత్యంత జాగ్రత్తగా అభ్యర్థులు వారి వివరాలను కేటాయించిన ఆయా బ్లాకుల్లో తప్పులు లేకుండా నమోదు చేసేలా చూడాలని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి, మౌలిక వసతులను కల్పించాలని, నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని,ఆర్టీసీ బస్సులు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్, సిబ్బంది అందుబాటు లో ఉండాలని, పరీక్ష పేపర్లు, ఓఎంఆర్ షీట్ లను పకడ్బందీగా, తగిన జాగ్రత్త చర్యల నడుమ తప్పనిసరిగా ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సమయానుకూలంగా వ్యవహరించాల న్నారు. ఇన్విజి లేటర్ లతో సమావేశాలను ఏర్పాటు చేయాలని,సెంటర్ లలో సీసీ కెమెరాల పని తీరును సరిచూసుకోవాలని, అభ్యర్థుల హాల్ టికెట్, గుర్తింపు పొందిన ప్రభుత్వ ఐడీ కార్డును సరిగా చూడాలని, నిర్దేశించిన రూట్ లలో మాత్రమే ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్ పత్రాలను తీసుకొని వెళ్ళాలని, పోలీసు బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్లు,ఫ్లయింగ్ స్క్వాడ్లు,రూట్ అధికారులు, అబ్జర్వర్ లు, ఐడెంటిఫికేషన్అధికారులు,సంబంధితశాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.

**అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కీలక సూచనలు**

అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్ సైట్ ద్వారా గ్రూప్-2 హాల్ టికెట్ లను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్షార్థులు హాల్ టికెట్ ను ఏ4 సైజ్ పేపర్ లో కలర్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్ పై అభ్యర్థులు తమ తాజా పాస్ పోర్టు ఫోటోను అతికించాలన్నారు. డౌన్లోడ్ చేసిన హాల్ టికెట్ పై ఫోటో సరిగా ముద్రించి లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్తో మూడు పాస్ పోర్టు ఫోటోలతో పాటు వెబ్ సైట్ లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్ కు అందించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తా మని, పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, అభరణాలు ధరించరాదని సూచించారు. పరీక్షార్థులు మెహింది, తాత్కాలిక టాటూలను వేసుకోరాదని స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్ ను,బ్లూ (లేదా) బ్లాక్ బాల్ పాయింట్ పెన్తో పాటు గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష సమయ పాలనకు సూచికగా ప్రతీ అర్ధగంటకోసారి బెల్ మోగుతుందని తెలిపారు. అదే విధంగా మాల్ ప్రాక్టీస్ కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. అభ్యర్థులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు బయోమెట్రిక్ విధానంపై అధికారులు, ఇన్విజిలేటర్ లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 9052308621 టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించి, వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఏసీపీ పార్థసారథి, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, డీఎంహెచ్ఓ మల్లికార్జున్ రావు, డీఏఓ రామారావు నాయక్, పోలీసు శాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు, దివాళా తీసి కుటుంబం

మంచిర్యాల: స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు ఓ కుటుంబాన్ని నిండా ముంచాయి. ఆశించిన లాభాలు రాకపోవడం, అప్పులు తెచ్చిన చోట ఒత్తిళ్లు ఎక్కువవడంతో కుటుంబమంతా కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పురుగుల మందు తాగి సూసైడ్ అటెంప్ట్ చేయగా.. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కాసిపేట గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకోగా.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం మంచిర్యాల జిల్లాలో కలకలం రేపింది. బాధితులంతా ఇప్పుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ప్రాథమికంగా తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కాసీపేట గ్రామానికి చెందిన సముద్రాల మొండయ్య కిరాణా షాప్ నడిపిస్తుండేవాడు. ఆయనకు భార్య శ్రీదేవి, కొడుకు శివ ప్రసాద్, కూతురు చైతన్య ఉన్నారు. కాగా కొద్దిరోజులుగా శివ ప్రసాద్ స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టాడు. ఇందుకు తెలిసిన వారి దగ్గర పెద్ద మొత్తం లోనే అప్పులు చేశాడు. కానీ లాభాలు ఆశించినంతగా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. స్నేహితులు, సన్నిహితుల నుంచి తీసుకున్న అప్పులు, వడ్డీలు చెల్లించేందుకు వివిధ లోన్ యాప్ ల నుంచి కూడా వీలైనంత అప్పులు చేశారు. అయినా సమస్య తీరకపోవడం, అప్పులు ఇచ్చిన వ్యక్తుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువవడంతో ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు, లోన్ యాప్ ల అప్పులతో తీవ్రంగా నష్టపోయిన కుటుంబం సూసైడ్ చేసుకునేందుకు నిర్ణయించుకుంది. ఈ మేరకు మంగళవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో మొండయ్య (60), సముద్రాల శ్రీదేవి(50) కూతురు చైతన్య (30) కుమారుడు శివ ప్రసాద్(26) అంతా కలిసి గడ్డి మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. అనంతరం సముద్రాల మొండయ్య గడ్డి మందు తాగిన విషయాన్ని తన బావమరిది రమేష్ కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వాళ్లు హుటాహుటిన మొండయ్య ఇంటికి చేరుకోగా.. వాళ్లంతా గడ్డి మందు తాగి కనిపించారు. అనంతరం వారిని 108 వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వెంటనే మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ వారి పరిస్థితి మెరుగు పడకపోవడంతో నలుగురినీ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబంలో నలుగురు గడ్డి మందు తాగగా.. వారిని ఎంజీఎం ఎమర్జెన్సీ వార్డులో అడ్మిట్ చేసి ట్రీట్మెంట్ అందిస్తున్నారు. కాగా అందులో శివ ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మొండయ్య, శ్రీదేవి, చైతన్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగానే ఉండగా.. మరికొన్ని గంటలు గడిస్తేగానీ వారి ఆరోగ్య పరిస్థితిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కాగా స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు, లోన్ యాప్ లలో అప్పులతో కుటుంబం మొత్తం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం మంచిర్యాల జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది.

# జాతీయ లోక్ అదాలత్లో కేసుల పరిష్కారం చేసుకోవాలి

**- రాజి మార్గమే రాజా మార్గం నినాదాన్ని మనసులో నాటాలి**

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో డిసెంబర్ పద్నాలుగవ తారీఖున నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసులను పరిష్కారం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు గారు సూచనలు చేశారు. జడ్జి మాట్లాడుతూ ప్రజలు ద్వేష భావాలను తగ్గించుకొని రాజి మార్గాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. రాజి మార్గమే రాజా మార్గం అని మనసులో నాటుకోవాలని తెలిపారు, దాంతో విలువైన సమయం, డబ్బు దుర్వినియోగం కాదని అన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పొలిసు స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని జడ్జి గారు అన్నారు. వివిధ కేసుల్లోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి పేర్కొన్నారు

# ట్రైని కానిస్టేబుల్స్ కి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ






మామునూర్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా మామునూర్ నాలుగవ బెటాలియన్ నందు ట్రైని కానిస్టేబుల్స్ కి ఆర్ట్ అఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు. మామునూర్: నాలుగవ బెటాలియన్ లో డిసెంబర్ 09 నుండి 11 వరకు మూడు రోజులు ఆర్ట్ అఫ్ లివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా మరియు బ్రీత్ వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కమాండెంట్ బి. రామ్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఆర్ట్ అఫ్ లివింగ్ టీచర్ శోభ యోగా యొక్క ప్రాముఖ్యత ట్రైని కానిస్టేబుల్స్ కి వివరించారు. ఈ తరగతులలో నేర్చుకున్న యోగా మీరు నిరంతరం సాధన చేసినట్లయితే మీకు సర్వీస్ లో మరియు మీ వ్యక్తిగత జీవితంలో ఉపయోగపడుతుంది అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ట్రైనింగ్ ఇంచార్జ్ అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వు ఇన్స్పెక్టర్స్ శోభన్, పురుషోత్తం రెడ్డి మరియు అధికారులు, ట్రైనింగ్ సిబ్బంది మరియు ఆర్ట్ అఫ్ లివింగ్ టీచర్స్ భాస్కర్, శ్రీలేఖ వాలెంటీర్స్ శ్రీహర్షిణి, గోపిక, శ్రీనివాస్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# 11వ ప్రపంచ వ్యవసాయ గణనపై శిక్షణ కార్యక్రమం



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల ఐడిఓసి హాల్లో మండల వ్యవసాయఅధికారులకు, విస్తరణాధికారులకు, మండల ప్లానింగ్ స్టాటిస్టికల్ అధికారులకు 11వ ప్రపంచ వ్యవసాయ గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య ప్రణాళిక అధికారి పెద్ది సుబ్బారావు మాట్లాడుతూ ఈగణన రెండు దశలలో జరుగునని రెండవ దశలో 70 గ్రామాలలో 57 మంది విస్తరణ అధికారులు పాల్గొంటారని మరియు మూడవ దశలో 29 గ్రామాలలో ఏడు శాతం ఆధారంగా తీసుకున్న గ్రామాలలో ఇన్ పుట్ సర్వేని మూడవ దశలో 2022-23 సంవత్సరంను ఆధారం చేసుకొని మండల ప్లానింగ్ స్టాటిస్టికల్ అధికారులు చేస్తారని తెలిపారు. ఈ రెండవ దశలో 2021 - 22 ఆధార సంవత్సరం తీసుకొని ఆ సర్వే నంబర్లలో ఏ ఏ పంటలు వేశారు వాటి దిగుబడి వివరాలను సేకరిస్తారు. ఈ వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేస్తారన్నారు. ఈ సర్వేని గడువు లోపల పూర్తి చేయాలని సిపిఓ కోరారు. తదుపరి విజయ నిర్మల జిల్లా వ్యవసాయ అధికారి మరియు మాస్టర్ ట్రైనర్ విజయలక్ష్మి స్టాటిస్టికల్ ఆఫీసర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ శిబిరాన్ని కొనసాగిస్తూ మొబైల్ యాప్ ద్వారా ఏ విధంగా నమోదు చేయాలి అనేది వివరించారు వారికి మొబైల్లో నమోదు చేయడానికి కావలసిన లాగిన్స్ క్రియేట్ చేసి ఇస్తామని తెలిపారు.

# బ్యాక్ యాడ్ పౌల్ట్రీ లబ్ధిదారులకు కోడి పిల్లలను పంపిణి చేసిన మంత్రి సీతక్క



వెంకటాపూర్, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): బుధవారం వెంకటాపూర్ మండలంలో వెన్నెల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టినటువంటి పెరటి కోళ్ల పెంపకం మదర్ యూనిట్ నుండి బ్యాక్ యాడ్ పౌల్ట్రీ లబ్ధిదారులకు కోడి పిల్లలను రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా శక్తిలో 17 రకాలైన పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది ఈ పథకాల్లో భాగంగా మదర్ యూనిట్ కోళ్ల పెంపకం అలాగే పెరటి కోళ్ల పెంపకం కూడా చేపట్టడం జరిగింది. ఇది మండలానికి ఒక యూనిట్ ఇచ్చినారు వెంకటాపూర్ మండలం చందన గ్రామ సమైక్య రుద్రమదేవి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలకు ఈ యొక్క యూనిట్ 291,000 శ్రీనిధి ద్వారా ఋణం ఇవ్వటం జరిగింది. 45 రోజులు కోడి పిల్లలు పెంచిన తర్వాత బ్యాక్ సైడ్ పౌల్ట్రీగా మండల పరిధిలో ఉన్నటువంటి స్వయం సహాయక సంఘ సభ్యులకు ఈ యొక్క కోడి పిల్లలు 50 నుండి 100 కోడి పిల్లలు ఒక యూనిట్ గా బ్యాంకు లింకేజీ మరియు శ్రీనిధి ద్వారా లోను ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం బాయిలర్ కోళ్లు తినడం ద్వారా అనేక రోగాలు పాలవుతున్నారని ప్రజలు తెలుసుకోవడం అందుకనే పెరటి కోళ్ల పెంపకం వైపు ఎక్కువ మగ్గుచూపుడం ద్వారా మహిళా సంఘ సభ్యులకు అదనపు ఆదాయంగా దీన్ని చేకూర్చే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఇటువంటి అవకాశాలు భవిష్యత్తులో మన జిల్లాలో ఉన్నటువంటి మేడారం జాతరకు ఆ సమయంలో పౌల్ట్రీ పెంపకం చేపట్టడం ద్వారా మహిళలు అదనపు ఆదాయం పొందవచ్చునని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడా కుల అశోక్ తో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంపత్ రావు, అదనపు డిఆర్డిఓ బాలస్వామి, డిపిఎం లీలా కుమారి ఏపిఎం అలవాల రవి మండల సమైక్య అధ్యక్షురాలు అజ్మీర కవిత ఉపాధ్యక్షురాలు రామిండ్ల జ్యోతి కార్యదర్శి నరికే కవిత సిసిఐలయ్య సిసి సమ్మక్క సీసీ కవిత గ్రామ సమైక్య పాలకవర్గ సభ్యులు మండల మహిళా సంఘ సభ్యులు మండల పరిషత్ అధికారి మండల పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా ప్రతినిధులపై దాడులు అమానుషం

**- మోహన్ బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

**- టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు**



సూర్యాపేట, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన మీడియా ప్రతినిధులపై అకారణంగా దాడి చేసి గాయపరిచి అసభ్య పదజాలంతో దూషించిన సినీ నటుడు మంచు మోహన్ బాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ అనుబంధం) సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేసి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కు వినతి పత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వృత్తి బాధ్యతగా కవరేజ్ కి వెళ్లిన మీడియా ప్రతినిధులను దూషించి దాడి చేయడం హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. ఒక సీనియర్ నటుడుగా పద్మశ్రీ అవార్డు పొందిన నటుడు మోహన్ బాబు ప్రతి విషయంలో ఓర్పు వహించాలని ఆయన వివరించారు. కుటుంబంలోనే పరస్పర వివాదాలను పరిష్కరించుకోలేక బయటకు వచ్చారని, అలాంటప్పుడు ఒక సెలబ్రిటీ విషయంలో ఏమి జరుగుతుందని ఆదుర్దా సమాజానికి తెలియజెప్పే బాధ్యత మీడియాపై ఉంటుందన్నారు. సమన్వయ లోపం లేక కుటుంబ విషయాలను బహిర్గతం చేసుకున్న మోహన్ బాబు మరింత దుందుడుకుగా వ్యవహరించి కవరేజ్ కి వచ్చిన టీవీ9 ప్రతినిధి రంజిత్ తో పాటు ఎన్టీవీ, ఈటీవీ ప్రతినిధులపై కూడా దాడి చేయడం సిగ్గుచేటు అని, ఇలాంటి తలవొంపులు తెచ్చే విషయాల పట్ల మోహన్ బాబు ఓర్పుతో వ్యవహరించాల్సి నీ మంచి మనసు ఉండాల్సి ఉండేదని ఆయన హితవు పలికారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మీడియా స్వేచ్ఛను హరిస్తూ మీడియా ప్రజలపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వృత్తి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల పట్ల దాడులు జరిగితే సంబంధిత వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించేలా చట్టంలో మార్పులు తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మీడియాపై దాడులు చేసిన వారిని సభ్య సమాజం నిలదీయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను తీసుకువచ్చి మీడియా వారిపై దాడి చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇంకా టి యు డబ్ల్యూ జే ఐజేయు సూర్యాపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున్ రెబ్బ విజయకుమార్ లు మాట్లాడారు. ఇంకా ఈ నిరసన ప్రదర్శన కార్యక్రమంలో విలేకరులు తండు వెంకటేష్, మధు, వేణుమాధవ్, జనార్ధన చారి, పాషా, పల్లె మణి బాబు, రామచంద్ర రాజు, వెంకటేష్, విక్రం, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టంకై అంగన్వాడీ భవనాల నిర్మాణం

**- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**



ములుగు జిల్లా, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): బుధవారం వెంకటాపూర్ మండలంలోని నారాయణ పూర్ గ్రామంలో పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం నూతన భవనానికి రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పూర్వ ప్రాథమిక విద్యను మరింత పటిష్టం చేయాలని ఉద్దేశ్యంతో అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలను నిర్మించడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈ రోజు నారాయణపూర్ గ్రామంలో ఈ నూతన భవనానికి శంకు స్థాపన చేయడం జరిగిందని అన్నారు. పిల్లల మానసిక వికాసం అనేది పూర్వ ప్రాథమిక విద్యతోనే జరుగుతుందని, అందులో భాగంగానే చక్కని పౌష్టికాహారంతో పాటు పిల్లలకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా భవిష్యత్ తెలంగాణ పౌరులను నైపుణ్యమైన వనరులుగా తీర్చిదిద్దడం ద్వారా మన తెలంగాణ రాష్ట్రం మరింత పురోగమిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు మాట్లాడుతూ నిర్ణీత సమయంలో ఈ భవనం పూర్తి చేయడం జరుగుతుందని, అంగన్వాడీ టీచర్లు జిల్లాలో సామ్, మామ్ పిల్లలు లేకుండా అందరూ సాధారణ స్థాయికి వచ్చేలా కృషి చేయాలని అన్నారు. జిల్లా స%శీ%క్షేమ అధికారి శిరీష మాట్లాడుతూ జిల్లాలో నూతన అంగన్వాడీ కేంద్రాలను మంజూరీ చేసి వాటికి శంఖుస్థాపన చేసిన మంత్రికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా గ్రామం లోని అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాశన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ఏటూరునాగారం, వెంకటాపురం సీడీపీఓ లు ప్రేమలత, ధనలక్ష్మి లు, స్థానిక ఐసీడీఎస్ సూపర్వైజర్ లు, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాల కూతల ఆల వెంకటేశ్వర్ రెడ్డి అంటూ ఆరోపణలు

**-అవాకులు చెవాకులు నియోజకవర్గంలో పేలవు**

**- మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లేపాగు ప్రశాంత్ వాఖ్యలు**



దేవరకద్ర, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): అబద్దాల కూతల బీఆర్ఎస్ ఆల వెంకటేశ్వర్ రెడ్డి దేవరకద్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నవు, నీ అవాకులు చెవాకులు పేల్చిన దేవరకద్ర ప్రజలు మిమ్ములను నమ్మే స్థితిలో లేరని మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ హెచ్చరించారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పేదల గుండె చప్పుడే కాంగ్రెస్ పార్టీ అని, పేదలను అన్ని విధాలుగా ఆదుకునే పార్టీయే హస్తం పార్టీ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులందరికీ 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయన్నారు. మహిళలకు ఉచిత బస్సు,200 యూనిట్లకు ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ, కింటా సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్,ఇలా అనేక పథకాలు ప్రజలకు అందజేస్తుందని తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గ ప్రజల అండదండలతో ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి నియోజకవర్గన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజవర్గంగా తీర్చిదిద్దుతున్నారని కోరారు. బీఆర్ఎస్ పార్టీ పదిసంవత్సరాలు అధికారంలో ఉండి కొత్తకోట మండలానికి ఒక్క రూపాయి కూడా తెచ్చినా పాపాన పోలేదని ఆరోపణలు చేశారు. బడిపిల్లలు చెట్ల క్రింద చదువుకుంటూ ఉంటే చలించిపోయి ఎమ్మెల్యే జిఎమ్మార్ వెంటనే భవనాలు నిర్మించాలని ప్రత్యేక చొరవతో శాంక్షన్ చేయించినా చరిత్ర కాంగ్రెస్ పార్టీ దేనని సూచించారు. కొత్తకోట పట్టణం లో నెలకు యాభై వేల రూపాయలు వచ్చే ప్రభుత్వ భవనాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎందుకు ఆకస్మి కంగా ఖాళీ చేసి కూల్చి వేశారని ఆరోపించారు. ప్రభుత్వానికి ప్రతినెల లక్ష రూపాయలు నష్టమే కదా అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ వాళ్లు బోనస్ రాదని,అన్నోల్లే రైతులకు పడుతున్నా బోనస్ ను చూసి మాజీ సర్పంచ్ ఎద్దుల నాగేష్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చే బోనస్ కోసం ఆశపడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తక్కువ ధరకు రైతుల వద్ద వడ్లను కొనుగోలు చేసి ఇక్కడ రైతులను మోసం చేసి అమ్మడానికి వచ్చి దొరికిపోయిన దొంగలు మీరు మా ప్రభుత్వం గురించి, మా ఎమ్మెల్యే గురించి మాట్లాడే హరత మీకు లేదని ఫైరయ్యారు.ప్రజలకు ముఖ్యంగా రైతులకు ఇచ్చినా హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంటే జీర్ణించుకోలేని మీరు పని గట్టుకొని పనికి రాని అంశా లను లేవనెత్తుతూ నానాయాగి చేస్తుంటే చూస్తూ ఊరుకోలేం, తగిన మూల్యాన్ని చెల్లించాల్సిందేనన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షు డు నగరపు బీచ్ పల్లి,టౌన్ అధ్యక్షులు పోతులపల్లి శ్రీనివాస్, కిసాన్ సెల్ వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎంజె,బోయేజ్, ప్రధాన కార్యదర్శిఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, డైరెక్టర్ బాదం వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు జే ఏం మిషేఖ్, డీలర్ శ్రీనివాసన్ రెడ్డి, ముజీబ్, గుంత రమణ,రైతు అధ్యక్ష్యాలు సంద్యపాగా వెంకటేష్, లక్ష్మమ్మయ్య, యూత్ కాంగ్రెస్ అజీజ్ అలీ,దిలీప్ రెడ్డి,బాలరాజు, నవీన్, అంజి యాదవ్, వలుగుమాన్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు మోతిలాల్ ఆర్థిక సహాయం






మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రమవత్ నీమా నాయక్

పాలకవీడ, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): పాలకవీడు మండలంలోని శూన్యం పహాడ్ గ్రామానికి చెందిన గుజ్జుల శివ ఇటీవల కాలంలో మరణించగా బుధవారం వారి పెద్దకర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాలోత్ మోతిలాల్ నాయక్ యాభై కిలోల బియ్యం, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రమవత్ నీమా నాయక్ ఏనిమిది వేల రూపాయలు ఆర్థిక సాయం చేసి శివ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అతని ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్రహం, కృష్ణ, సుబ్బారావు, తరుణ్, పాల్గొన్నారు.

# గుడుగుంట్లపాలెంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



పాలకవీడు, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): పాలకీడు మండలం గుడుగుంట్ల పాలెం గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (సబ్ సెంటర్) నందు బుధవారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారిణి నాగిని ఆధ్వర్యంలో క్షయవ్యాధి పరీక్షల స్క్రీనింగ్ చేయడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ పున్న నాగిని మాట్లాడుతూ జ్వరం,తెమడతో కూడిన దగ్గు, తెమడలో రక్తం పడటం, అలసట, నీరసం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, శారీరక ఆరోగ్యంలో, ఆకస్మాత్తుగా మార్పు చాతిలో నొప్పి, గుల్లలు లేదా ఏదైనా వాపు రావటం ఇలాంటి లక్షణాలు ఎవరికైనా ఉంటే ఈ యొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లక్షణాలు ఉన్న వారి తెమడను పరీక్ష చేయడం జరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఎస్. శ్రీనివాస్, జి. విద్య, సూపర్వైజర్ డి. వెంకటేశ్వర్లు, జి ఎం. నరసయ్య, హెల్త్ అసిస్టెంట్ టి బి.ఎస్ టి ఎస్.మమత, ఎల్ టి.బి.శారద, వి.రాంబాయి, ఆశ వర్కర్ మంజుల, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**- ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి**
**- నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి**
**- నగర అభివృద్ధిపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్షా**

వరంగల్ జిల్లా, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మరియు వరంగల్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వరంగల్ జిల్లా పర్యటనలో అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు శ్రీమతి కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్ఆర్, ఓఆర్ఆర్ , భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టు కు సంబంధించిన డీపీఆర్ లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని, ఈ ప్రాజెక్టుకు భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన భద్రకాళి చెరువు శుద్ధీకరణపనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీ దాన కిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్ లు డాక్టర్ సత్య శారదా, పి. ప్రావీణ్య, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# భూములు కోల్పోయిన రైతులతో ఆర్డీవో సమావేశం

**- రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి**
**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుబ్బారావు**



పాలకవీడు, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): పాలకవీడు మండలం లోని జాన్ పహాడ్ గ్రామ సచివాలయంలో నేడు కృష్ణానది లిఫ్ట్ నిర్మాణంలో భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం గురించి బుధవారం సంబంధిత రైతులతో హుజూర్నగర్ ఆర్డీఓ కే శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు పాల్గొని రైతులకు ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం ఇవ్వాలని ఆర్డీఓకి విజ్ఞప్తి చేశారు. అవసరమైతే నష్టపరిహారం పెంచే విషయమై రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికు విన్నవించి నష్టపరిహారం పెంచే విధంగా కృషి చేస్తామన్నారు. ఇట్టి కార్యక్రమంలో పాలకవీడు ఎమ్మార్వో కమలాకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ వూట్ల వెంకటేశ్వర్లు రైతులు కూరపాటి కోటయ్య, కే పుల్లారావు, కే సైదయ్య, కే నాగేశ్వరరావు, నాగేల్ల సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు భేష్

**- సంక్లిష్టమైన ఆపరేషన్లకు కేరాఫ్ అడ్రస్ గా ప్రభుత్వ ఆసుపత్రి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 11 (తీన్మార్ న్యూస్): పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో గతంతో పోలిస్తే వైద్య సేవలు మరింత మెరుగయ్యాయని ఇందుకు జాతీయస్థాయి NQAS సర్టిఫికేషన్ రావడమే ఉదాహరణ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఆసుపత్రిలో సేవలు మెరుగు పడటానికి కృషిచేసిన డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంప్రసాద్ మరియు వైద్య సిబ్బందిని ఆయన అభినందించారు. గత నెలలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగి 100 వరకు చేరుకోవటం, ఖరీదైన సంక్లిష్టమైన మోకాళ్ళ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించటం, రొమ్ము క్యాన్సర్ తో బాధపడుతున్న 60 ఏళ్ల మహిళకు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిర్వహించడం పట్ల జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు విశేష కృషి చేసిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ సరళ, డాక్టర్ సోమరాజు దొర మరియు డాక్టర్ శైలేష్ కుమార్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటికే రూ.78 లక్షలు ఎమ్మెల్యే డిఎంఎఫ్టీ ఫండ్ తో ఆసుపత్రికి కావలసిన సామాగ్రిని కొనుగోలు చేయుటకు టెండర్లు పిలవగా, ఆసుపత్రిలో మహిళా శక్తి క్యాంటీన్ , ఓపెన్ జిమ్ త్వరలో ఏర్పాటు కానున్నాయి. ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించడంలో ఎటువంటి సహాయం కావాలన్నా తానున్నాను అని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తు లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ఎంవో సోమరాజు దొర మరియు నర్సింగ్ సూపరింటెండెంట్ లక్ష్మి మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు, యువత మత్తుకు బానిస అవ్వకూడదు..

**- యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తయారు చేసిన మత్తు పదార్థాల వ్యతిరేక పోస్టర్లు విడుదల చేసిన జన్నారం రెండోవ ఎస్ఐ**



జన్నారం: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ యొక్క లక్ష్యాలను సాధించడం కోసం కష్టపడాలని జన్నారం మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తానాజీ అన్నారు, యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలను వ్యతిరేకిద్దాం బంగారు భవిష్యత్తు కు బాటలు వేదాం అనే నినాదంతో ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లను వారు పోలీస్ స్టేషన్ ముందు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలకు ఎల్లపుడు దూరంగా ఉండి తమ లక్ష్యాల వేటలో ఉండాలని విజ్ఞప్తి చేశారు, కొన్ని అనుకోని సందర్భలలో మానసిక స్థితి బాగా లేక అలవాటైన కొన్ని చెడు వ్యసనాలు మీ కుటుంభలనే నాశనం చేసే విధంగా మారుతాయనే విషయాన్ని యువత మరియు విద్యార్థులు గుర్తుంచుకోవాలని కోరారు. మీకు ఈ వయస్సులో అన్ని విషయాలు తెలుసుకోవాలనే ఆత్రుత ఉండటంలో తప్పు లేదు కానీ అవి మంచి విషయాల వరకే ఉండాలి తప్ప మీ జీవితాలను, మీ లక్ష్యాలను పాడు చేసే విధంగా ఉండదని యువతకు సూచించారు. డ్రగ్స్ తీసుకున్న వాటిని ప్రోత్సహించిన కఠిన మైన శిక్షలు ఉంటాయన్నారు. మీరు కేస్ లలో చిక్కుకునే ప్రమాదం కూడా ఉంది కాబట్టి దాని వల్ల మీరు ఎలాంటి ఉద్యోగాలకు కూడా అప్లై చేసుకోలేరన్నారు. యువత, విద్యార్థులు అంత కూడా మత్తు పదార్థాలకు దూరంగా క్షేమంగా ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు,రాజ్ కుమార్,ప్రణెయ్,వ ణిసాగార్, అక్షయ్, అంజు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా ఆగిన 'స్మార్ట్ సిటీ' రోడ్డు

**- వరంగల్‌లో ఏండ్లు గడిచినా పూర్తి కాని పనులు**
**- ముందుకు పోని మురుగునీరు**
**- నోచుకోని సెంట్రర్ లైటింగ్ సిస్టమ్ పనులు**



వరంగల్: హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ నగరాన్ని మారుస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. అభివృద్ధి పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పుడే కాదు.. గత పదేండ్లుగా ఇదే పరిస్థితి ఉంది. బాలాజీ నగర్ జంక్షన్ నుంచి క్రిస్టియన్ కాలనీ నర్సంపేట రోడ్ వరకు 100 ఫీట్ల రోడ్డు, డ్రయినేజీ, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని తొమ్మిదేండ్ల కిందట రూ. 37 కోట్లతో అప్పటి ఓ ప్రజా ప్రతినిధి ఒత్తిడితో శంకుస్థాపనలు జరిగాయి. రోడ్డు వేయడం ప్రారంభించినా అర్ధాంతరంగా మధ్యలోనే ఆపేశారు. దాంతో ఇప్పటికీ ఆ రోడ్డు అసంపూర్తిగానే ఉంది. అంతేకాదు, ఆ రోడ్డుకు ఇరువైపులా కచ్చా డ్రయినేజీ ఉండటంతో దానిలోకి మట్టిపడి మురుగునీరు ముందుకు పోక దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలం వచ్చిందంటే కట్ట మల్లన్న చెరువు నుంచి వస్తున్న నీరు దానితోపాటు వరద నీరు చేరడంతో డ్రయినేజీలోని నీరు రోడ్డుపైకి వచ్చి పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. సమస్యను అరికట్టాలని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా డ్రయినేజీ నిర్మాణం పూర్తి కావడం లేదు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం కోసం ఇరువైపులా డ్రయినేజీ నిర్మించాల్సిన అవసరం ఉందని కాలనీవాసులు కోరుతున్నారు.

పైపులతో రోడ్డు ప్రమాదాలు.. తొమ్మిదేండ్ల కిందట ప్రారంభించిన స్మార్ట్‌సిటీ రోడ్డు అసంపూర్తిగా నిలిచింది. రోడ్డు నిర్మాణం చేసినప్పటికీ దానికి ఇరువైపులా ఉన్న డ్రయినేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు నిలిచిపోయాయి. అంతేకాదు. రోడ్డుకు మధ్యలో ఉన్న పైప్‌లైన్లు తీయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు పైప్‌లైన్లు, మరోవైపు లైట్లు లేక చీకటిగా ఉండటంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బాలాజీ నగర్ జంక్షన్ నుంచి నర్సంపేట రోడ్ క్రిస్టియన్ కాలనీ వరకు ఓ బడా గుత్తేదారు పైపులను డివైడర్ స్థానంలో పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు. ఎన్టీఆర్‌నగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ప్రమాదానికి గురై మరణించాడు. ఇలాంటి సంఘటనలు 100 ఫీట్ల రోడ్డుపైన ప్రతిరోజూ ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి.

# పొలాల్లో సోలార్ పవర్



ఖమ్మం: రాష్ట్రంలోని రైతుల పంట పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవమ్ ఉత్థాన్ మహాభియాన్) పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ పథకానికి తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో)ను నోడల్ ఏజెన్సీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఏడాదిలో 300 రోజుల పాటు సౌరవిద్యుత్ ఉత్పాదనకు అవకాశం ఉంది.

**సబ్ స్టేషన్ల వారీగా నోటిఫికేషన్..**

రాష్ట్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ల వారీగా ఎంత సామర్థ్యంతో కొత్త సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశాలున్నాయో వెల్లడిస్తూ త్వరలో డిస్కమ్‌లు నోటిఫికేషన్ ఇస్తాయి. నిర్ణీత సామర్థ్యం మేరకు సౌర విద్యుత్ కేంద్రాల స్థాపనకు రైతుల నుంచి రెడ్కో దరఖాస్తులను స్వీకరించనుంది. రైతులు వ్యక్తిగతంగా, సంఘాలుగా, సహకార సంఘాలుగా ఏర్పడి వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు.

**డిస్కమ్‌ల ద్వారా కొనుగోళ్లు**

రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసుకునే సౌర విద్యుత్ కేంద్రాల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)లు కొనుగోలు చేస్తాయి. ఒక్కో యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 ధరను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఇప్పటికే ఖరారు చేసింది.సోలార్ ప్లాంట్లలో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో రైతులు తమ వ్యవసాయ అవసరాలకు వాడుకోగా.. మిగిలిన విద్యుత్‌ను డిస్కమ్‌లకు విక్రయిం చవచ్చు. డిస్కమ్‌లు ప్రస్తుతం సౌర విద్యుత్ ప్లాంట్ల నుంచి సగటున యూనిట్‌కు రూ.2.58 ధరతో విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. రైతులకు మాత్రం కాస్త యూనిట్‌కు రూ.3.13 ధర చెల్లిస్తాయి.

టెండర్లకు పిలుపు : మహేందర్ రెడ్డి, రెడ్కో అధికారి, వరంగల్ ఇప్పటివరకు దీనికి సంబంధించిన నియమ నిబంధనలపై మార్గదర్శకాలు రాలేదు. ప్రస్తుతానికి మహిళా స్వయం సహాయక సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు టెండర్లు దాఖలు చేయవచ్చు. మహిళా స్వయం సహాయ క సంఘాలకు సర్ప్ నుంచి లోన్ సౌకర్యం ఉంది. ఈ మహిళా సంఘాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 10 మెగావాట్ల సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# మహిళా సమాఖ్య భవనానికి శంఖుస్థాపన చేసిన సుడా చైర్మన్..

**- ప్రజల అవసరాలకనుకూలంగా అభివృద్ధికి సుడా నిధులు కేటాయిస్తాం**
**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



కరీంనగర్ : ప్రజల అవసరాలకనుకూలంగా అభివృద్ధికి సుడా నిధులు వెచ్చిస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఇరవై రెండవ డివిజన్ పరిధిలోని శివాలయం పక్కన మహిళా సమాఖ్య భవనానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అడిషనల్ కలెక్టర్ సుడా వైస్ చైర్మన్ ప్రవుల్ దేశాయ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ లోని పద్నాలుగు వందల మంది మహిళా సమాఖ్య గ్రూపుల మహిళలకు ఉపయోగపడే విధంగా స్థానిక కార్పొరేటర్ గంట కల్యాణి శ్రీనివాస్ స్థానిక నాయకులు దండి రవీందర్,ముల్కల కవిత సమాఖ్య గ్రూపుల విజ్ఞాపన మేరకు ప్రస్తుతం పది లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందని అవి సరిపోకపోతే మరిన్ని నిధులు వెచ్చించయినా భవన నిర్మాణం పూర్తి చేసి అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ రాజేంద్ర ప్రసాద్,ఏఈ రమేష్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,సమైఖ్య సంఘాల అధ్యక్షులు జానం పేట అంజలి,హాజీరా సుల్తానా,రౌతు లలిత, రాచూరి స్రవంతి,సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# కబేళాలకు తరలిపోతున్న రాజన్న కోడెలు

కరీంనగర్: వేములవాడ రాజన్న కోడెలకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజన్న కోడెలను కబేళాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆగస్టు 12న 60 కోడెలను రాంబాబు అనే వ్యక్తికి ఆలయ ఈవో అప్పగించారు. మంత్రి మెప్పు కోసం నిబంధనలకు విరుద్ధంగా కోడెలను అప్పగించినట్టు తెలుస్తోంది. దీంతో మంత్రి కొండా సురేఖ సిఫార్సుతో రాజన్న ఆలయ కోడెలు పక్కదారి పట్టాయనే ఆరోపణ లు వస్తున్నాయి.ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సిఫారసుతో తెచ్చిన 60 కోడెల్లో ప్రస్తుతం 11 మాత్రమే ఉన్నాయి. మిగిలిన వాటి గురించి ఆరాతీయగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సదరు గోశాల నిర్వాహకుడు వీటి రాజన్న కోడెల గురించి పొంతనలేని సమాధా నాలు చెప్పడం అనుమానాలను పెంచుతోంది. గోశాల ముసుగులో గోవులను కబేళాలకు తరలిస్తున్నట్టు అతనిపై ఆరోపణలు వస్తున్నా యి.గీసుకొండ మండలం మనుగొండకు చెందిన మాదాసి రాంబాబుకు వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన 60 కోడెలను ఇచ్చారు. కానీ.. అతను చెప్పిన గోశాలలో ప్రస్తుతం 11 మాత్రమే ఉన్నాయి. మిగతా గోవులను విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆయన గతేడాది ఫిబ్రవరి 1న తమ కుటుంబ సభ్యుల పేరుతో రాజేశ్వర సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలుస్తోంది.గీసుకొండ మండలం గట్టుకిందిపల్లెలో డీబీఎం-38 సబ్ కెనాల్ పక్కన నాలుగు నెలల కిందట చిన్నపాక వేశారు.అందులోనే చిన్న గోశాల ఏర్పాటు చేశారు. ? తర్వాత వేములవాడ ఆలయం నుంచి 60 కోడెలను తీసుకొచ్చారు. అందులో 49 కోడెలను అమ్ముకున్నారని.. విశ్వ హిందూ పరిషత్ బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారువరంగల్ జిల్లా గీసుకొండ మండలం అనంతారం గ్రామంలో.. మంద స్వామి, రాంబాబు కలిసి ఐదేళ్ల కిందట హనుమాన్ గోశాలను నిర్వహించారు. పలు ఆలయాల నుంచి గోవు లను తీసుకొచ్చి సంరక్షణ పేరిట వీరు కబేళాలకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. కబేళాలకు అమ్ముతుండగా తాము అడ్డుకుని పోలీసులకు పట్టిచ్చినట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు.ఈ వ్యవహారం బయటకు రావడంతో.. హనుమాన్ గోశాలను మూసివేశారు. మళ్లీ కొత్తగా గట్టుకిందిపల్లెలో గోశాల ఏర్పాటు చేసి.. దీని ద్వారా దందా కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. తాను వేములవాడ నుంచి 60 కోడెలను తీసుకొచ్చింది వాస్తవమేనని గోశాల నిర్వాహకుడు రాంబాబు చెబుతున్నారు. కానీ.. ప్రస్తుతం తన వద్ద 11 ఉన్నాయని అంటున్నారు. తాను తీసుకొచ్చిన వాటిల్లో 26 కోడెలను తిరిగి వేములవాడలోని గోశాలలో అప్పగించానని చెబుతున్నారు. మిగతా వాటిల్లో కొన్ని చనిపోగా.మరికొన్ని తీసుకొస్తుండగానే పారిపోయినట్లు వింత సమాధానాలు చెప్పారు.ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో.. పోలీసులు దృష్టి సారించారు. 49 కోడెలను అమ్మేసినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేస్తున్నామని, రాంబాబు ఒక్కరికే 60 కోడెలను ఎలా ఇచ్చారనే విషయమై వేములవాడ ఈవోకు లెటర్ రాశామని పోలీసులు చెబుతున్నారు. ఈవో నుంచి రిప్లై వచ్చాక.. దాన్నిబట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# జన్నారంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి..

**- ఫీజు బకాయిలు విడుదల చేయాలి..**
**- నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ ప్రసాద్ పటేల్**

జన్నారం: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని "నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నీరటి రామ్ ప్రసాద్ అన్నారు, జన్నారం తాసిల్దార్ కార్యాలయాన్ని విద్యార్థులతో కలసి ముట్టడించారు. ఈ సంధర్భంగా రామ్ ప్రసాద్ మాట్లాడుతూ జన్నారం మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కొన్ని ఏండ్ల నుండి డిమాండ్ ఉన్న కూడా అధికారులు పట్టించుకోవడం లేదని, మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడం వల్ల దాదాపుగా ప్రతి ఏటా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న దాదాపు 200 నుండి 300 మంది విద్యార్థులు బయటకు వచ్చినప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడంతో 60శాతం విద్యార్థులు డ్రాప్ ఔట్స్ గా మిగులు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపుగా 3ఏండ్ల నుండి ఫీజు బకాయిలు విడుదల కాక విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటు న్నారని అన్నారు,ముఖ్యమంత్రి గారు స్వయంగా పీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఇప్పుడు ఉన్న స్కాలర్ షిప్స్ పెంచి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులకు ప్రస్తుత ధరలకు అనుకుణంగా అందిస్తామని చెప్పి మాట ఇచ్చి అధికారం లోకి వచ్చాక మాత్రం దాన్ని విస్మరించారని దుయ్యబట్టారు,

# కబేళాలకు తరలిపోతున్న రాజన్న కోడెలు

కరీంనగర్: వేములవాడ రాజన్న కోడెలకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజన్న కోడెలను కబేళాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆగస్టు 12న 60 కోడెలను రాంబాబు అనే వ్యక్తికి ఆలయ ఈవో అప్పగించారు. మంత్రి మెప్పు కోసం నిబంధనలకు విరుద్ధంగా కోడెలను అప్పగించినట్టు తెలుస్తోంది. దీంతో మంత్రి కొండా సురేఖ సిఫార్సుతో రాజన్న ఆలయ కోడెలు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వస్తున్నాయి.ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సిఫారసుతో తెచ్చిన 60 కోడెల్లో ప్రస్తుతం 11 మాత్రమే ఉన్నాయి. మిగిలిన వాటి గురించి ఆరాతీయగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సదరు గోశాల నిర్వాహకుడు వీటి రాజన్న కోడెల గురించి పొంతనలేని సమాధానాలు చెప్పడం అనుమానాలను పెంచుతోంది. గోశాల ముసు గులో గోవులను కబేళాలకు తరలిస్తున్నట్టు అతనిపై ఆరోపణలు వస్తున్నాయి.గీసుకొండ మండలం మనుగొండకు చెందిన మాదాసి రాంబాబుకు వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన 60 కోడెలను ఇచ్చారు. కానీ.. అతను చెప్పిన గోశాలలో ప్రస్తుతం 11 మాత్రమే ఉన్నాయి. మిగతా గోవులను విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆయన గతేడాది ఫిబ్రవరి 1న తమ కుటుంబ సభ్యుల పేరుతో రాజేశ్వర సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలుస్తోంది.గీసుకొండ మండలం గట్టుకిందిపల్లెలో డీబీఎం-38 సబ్ కెనాల్ పక్కన నాలుగు నెలల కిందట చిన్నపాక వేశారు.అందులోనే చిన్న గోశాల ఏర్పాటు చేశారు. ? తర్వాత వేములవాడ ఆలయం నుంచి 60 కోడెలను తీసుకొచ్చారు. అందులో 49 కోడెలను అమ్ముకున్నారని.. విశ్వ హిందూ పరిషత్ బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారువరంగల్ జిల్లా గీసుకొండ మండలం అనంతారం గ్రామంలో.. మంద స్వామి, రాంబాబు కలిసి ఐదేళ్ల కిందట హనుమాన్ గోశాలను నిర్వహించారు. పలు ఆలయాల నుంచి గోవులను తీసుకొచ్చి సంరక్షణ పేరిట వీరు కబేళాలకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. కబేళాలకు అమ్ముతుండగా తాము అడ్డుకుని పోలీసులకు పట్టిచ్చినట్లు బీజేపీ నేతలు చెబుతు న్నారు.ఈ వ్యవహారం బయటకు రావడంతో.. హనుమాన్ గోశాలను మూసివేశారు. మళ్లీ కొత్తగా గట్టుకిందిపల్లెలో గోశాల ఏర్పాటు చేసి.. దీని ద్వారా దందా కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. తాను వేములవాడ నుంచి 60 కోడెలను తీసుకొచ్చింది వాస్తవమేనని గోశాల నిర్వాహకుడు రాంబాబు చెబుతున్నారు. కానీ.. ప్రస్తుతం తన వద్ద 11 ఉన్నాయని అంటున్నారు. తాను తీసుకొచ్చిన వాటిల్లో 26 కోడెలను తిరిగి వేముల వాడలోని గోశాలలో అప్పగించానని చెబుతున్నారు. మిగతా వాటిల్లో కొన్ని చనిపోగా.మరికొన్ని తీసుకొస్తుండగానే పారిపోయినట్లు వింత సమాధానాలు చెప్పారు.ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో.. పోలీసులు దృష్టి సారించారు. 49 కోడెలను అమ్మేసినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేస్తున్నామని, రాంబాబు ఒక్కరికే 60 కోడెలను ఎలా ఇచ్చారనే విషయమై వేములవాడ ఈవోకు లెటర్ రాశామని పోలీసులు చెబుతున్నారు. ఈవో నుంచి రిప్లై వచ్చాక.. దాన్నిబట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే.. ఈ వ్యవహారంలో మంత్రి సురేఖ సిఫారసు లెటర్ కీలకంగా మారింది. మంత్రి రాంబాబుకు లెటర్ ఎందుకు ఇచ్చారనే చర్చ జరుగుతోంది.

# టీచర్ ఎలక్షన్స్ కు భారీగా పోటీ

కరీంనగర్: ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని సీపీఎస్ యూనియన్ నిర్ణయించింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరుమల్ రెడ్డి ఇన్నారెడ్డిని యూనియన్ నేతలు ఖరారు చేశారు. ఉమ్మడి కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలో.. తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గం, 13 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఇటీవలే వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట కొలిపాక వెంకటస్వామిని యూనియన్ ప్రకటించింది. ఈ కార్యవర్గ సమావేశంలోనూ కీలక నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయులకి గత 28 సంవత్సరాలుగా సేవలు అందించిన సీనియర్ టీచర్ తిరుమల్ రెడ్డి ఇన్నారెడ్డిని సీపీఎస్ యూనియన్ బలపరిచే అభ్యర్థిగా ప్రకటించింది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దింపుతున్నట్లు కార్యవర్గ సమావేశం తీర్మానించింది.రాబోయే రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకవైపు సీపీఎస్ అధ్యాపకుడిన్ని, మరోవైపు పాత పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయున్ని అభ్యర్థులుగా పోటీలో నిలిపామని చెప్పారు. సీపీఎస్, ఓపీఎస్ అనే తేడా లేకుండా.. ఉపాధ్యాయ వర్గం వీరి గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో సీపీఎస్ విధానంపై రెఫరెండంగా బరిలో ఉంటున్నామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయులకు గొప్ప అవకాశం వచ్చిందని యూనియన్ నేతలు వివరించారు. ఈ ఓటు హక్కుతో సీపీఎస్ సంఘ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ నాలుగు జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల కాలపరిమితి 2025 మార్చి 29 నాటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఎలక్షన్ కమిషన్ అర్హత కలిగిన ఓటర్లకు పేర్ల నమోదు కోసం అవకాశం కల్పించింది. 2024 డిసెంబర్ 30 న నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను వెలువరించనున్నారు.

# రాములమ్మకు కలిసి రాని కాలం

హైదరాబాద్: ప్రతిఘటన.. కర్తవ్యం.. రాములమ్మ.. ఇలా ఎన్నో హిట్ మూవీల్లో నటించి మాస్ ఇమేజ్ తెచ్చుకున్న విజయశాంతి.. ఈ మధ్య ఎక్కడా కనిపించడం లేదు. సరిలేరూ నీకేవ్వరూ చిత్రంతో సినిమాల్లో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టినా.. ఆ తర్వాత మాయమైపోయారు. సినిమాల్లో సక్సెస్ ఫుల్ గా రాణించినా.. పొలిటికల్‌గా మాత్రం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. ఎదుర్కొంటున్నారు కూడా..!సినిమా రంగంలో మంచి హవా కొనసాగుతున్న రోజుల్లోనే పొలిటికల్ అరంగ్రేట్ చేసి, భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ జాతీయ నేత ఎల్.కే.అద్వానీకి దగ్గరగా పనిచేశారు. అద్వానీ రథయాత్రల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా బీజేపీకి గుడ్ బై చెప్పారు. తల్లి తెలంగాణ పార్టీ స్థాపించి ప్రత్యేక రాష్ట్రం కోసవ పోరాటం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీని అప్పటి టీఆర్ఎస్‌లో విలీనం చేశారు. కేసీఆర్ స్వయంగా విజయశాంతిని పదో చెల్లిగా అభివర్ణించారు.అప్పటి టీఆర్ఎస్ నుంచి మెదక్ లోక్‌సభ సభ్యురాలుగా విజయం సాధించారు. తెలంగాణ బిల్లు పార్లమెంట్ లో పెట్టిన సందర్భంలో ఆమె బీఆర్ఎస్ నుంచి లోక్‌సభలో ఉన్న ఏకైక ఎంపీ. ఆ తర్వాత కేసీఆర్.. ఆమెను పార్టీ నుంచి పక్కన పెట్టారు. వెంటనే విజయశాంతి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. 2018 ఎన్నికలలో కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మళ్లీ పొలిటికల్ గా మళ్లీ టర్న్ తీసుకున్నారు. 2019 ఎన్నికలు ముగిసిన వెంటనే.. మళ్లీ బీజేపీ గూటికి చేరుకున్నారు విజయశాంతి. మునుగోడు ఉప ఎన్నిక ముందు వరకు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. మునుగోడు ఉప ఎన్నిక ముగిసిన వెంటనే? ఆమె మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు.హస్తం పార్టీలో చేరిన తర్వాత ఆమెకు పెద్దగా ప్రయారిటీ మాత్రం దక్కలేదు. పార్టీ నేతలు ఆమెను ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కూడా లేవు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన కొత్తలో సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో ట్వీట్లు చేస్తూ.. నేనున్నాను అని గుర్తు చేస్తూ ఉండేది. ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరూ ఆమెను పట్టించుకోవడం లేదట. దీంతో రాములమ్మది రాజకీయ అద్యాయం ముగిసినట్లేనా ? అన్న చర్చ పార్టీలో నడుస్తోంది. పార్టీలు తరచూ మారడం ఆమెకు పెద్ద మైనస్ గా మారినట్లు చెప్పుకుంటున్నారు. రాజకీయాల్లో అడుగులు తడబడితే ఎలా ఉంటుందో చెప్పడానికి విజయశాంతి బెస్ట్ ఎగ్జాపుల్ అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం పై నిషేధాజ్ఞలు కోనసాగింపు

## అనుమతి లేని డ్రోన్,డిజె సౌండ్స్ పై చర్యలు....

గోదావరిఖని: సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, ఐపీఎస్.,(ఐజి) ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని తెలపడం జరిగింది. మద్యం సేవించి వీధుల్లో రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమిసినీచినీదని, మద్యం ప్రియులు ఆగడాలకు కళ్లెం వేయడంలో పాటు ప్రజల భద్రత రక్షణ కోసం నిషేధాజ్ఞలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01-12-2024 నుండి 01-01-2025 వరకు కొనసాగుతాయని తెలిపారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. (భారతీయ న్యాయ సంహిత) బి న్ స్ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు

డీజే ,డ్రోన్ లపై నిషేధాజ్ఞలు పొడగింపు.....

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో డీజే సౌండ్ ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడగించమని అని సిపి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. చిన్నపిల్లలు



వృద్ధులు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్ లతో కూడిన డిజె సౌండ్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధించారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్ల వినియోగిస్తున్నారని అయితే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసిపి ల అనుమతి పొందాలని సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు ఏ స్థాయిలో మైక్ సెట్ లో వినియోగించాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు 01-12-2024 నుండి 01-01-2025 వరకు కొనసాగుతాయని తెలిపారు పరిస్థితుల ప్రభావం ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. (భారతీయ న్యాయ సంహిత) ఃబొ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు.

# ఆ ఆరుగురి ఎవరు..

## అడగడుగునా అడ్డుపడుతున్న నల్గొండ నేతలు

నల్గొండ: తెలంగాణ మంత్రివర్గ విస్తరణ అంశం రోజు రోజుకు పెండింగ్‌లో పడుతోంది. డెడ్‌లైన్ దాటుతున్నా విస్తరణపై ముఖ్యనేతలు నోరు మెదపడం లేదు. పరిపాలన చేపట్టి ఏడాది పూర్తవుతున్నా.. ఇంకా పూర్తి విస్తరణకు నోచుకోవడం లేదు. తెలంగాణ మంత్రివర్గంలో ప్రస్తుతం సీఎంతో పాటు 11 మంది మంత్రులు ఉన్నారు.క్యాబినెట్‌లోకి ఇంకా ఆరుగురిని తీసుకునే అవకాశం ఉంది. ఈ ఆరుగురి ఎంపిక విషయంలో రాష్ట్ర ముఖ్యనేతలు ఇప్పటికే పలుమార్లు ఢిల్లీ పెద్దలతో చర్చలు చేశారు. కానీ సమీకరణాలు కుదరకపోవడంతో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. వాస్తవానికి ఉన్న ఆరు బెర్తుల కోసం ఉమ్మడి జిల్లాల వారీగా ప్రాతినిధ్యం లేని జిల్లాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకొని క్యాబినెట్ కూర్పు చేయాలని భావించారు.ప్రధానంగా మంత్రివర్గ విస్తరణకు బ్రేక్ పడడానికి ఒకే ఒక అంశం అడ్డంకిగా మారిందంటూ కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ పెద్దలు కొందరికి కమిట్‌మెంట్ ఇచ్చారు. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండకు చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ బాధ్యతలు ఇవ్వడంతో పాటు గెలిపించుకొని వస్తే.. మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తామనే హామీ ఇచ్చినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఇప్పుడు ఈ హామీని నిలబెట్టుకోవాలని రాజగోపాల్ రెడ్డి పట్టుబడుతున్నారు. కానీ ఈ హామీ నెరవేర్చాలంటే కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.ఉమ్మడి నల్లగొండ నుంచి ఇప్పటికే ఇద్దరు సీనియర్ నేతలు మంత్రివర్గంలో ఉన్నారు. జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రివర్గంలో ఉన్నారు. ఇద్దరూ రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కావడం.. మళ్లీ రాజగోపాల్ రెడ్డికి ఇస్తే సామాజిక సమతూకం దెబ్బతినే ప్రమాదం ఉందని పార్టీ పెద్దలు ఆలోచన చేస్తున్నారట. ముగ్గురు రెడ్లు కావడం అందులోనూ కోమటిరెడ్డి ఫ్యామిలీ నుంచి ఇద్దరికి ఇచ్చినట్లవుతోంది.దీని వల్ల పొలిటికల్‌గా విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆలోచనలో పార్టీ పెద్దలు ఉన్నారట. అంతేకాదు అదే జిల్లా నుంచి ఇతర సామాజికవర్గాలైన బీర్ల ఐలయ్య, బాలు నాయక్ పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ కూర్పును ఎలా బ్యాలెన్స్ చేయాలనే విషయంలో క్లారిటీ రావడం లేదట. మరోవైపు రాజగోపాల్ రెడ్డి నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. హామీ ఇచ్చినప్పుడు ఈ సమీకరణాలు తెల్వదా అని ప్రశ్నిస్తున్నట్లు టాక్. దీంతో పార్టీ పెద్దలు డైలమాలో పడుతున్నారు. ఈ ఒక్క రీజన్ వల్లే మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతున్నట్లు పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి వాళ్లలో ఆశలు చిగురిస్తుంటాయ్. ఆయన హస్తినా నుంచి వచ్చాక గుడ్ న్యూస్ ఏం లేదని తెలిసి..సల్లబడిపోతారు. ఇట్ల పది సార్లు ఎదురుచూసి..ఎప్పుడైతే అప్పుడే అని అనుకుంటున్నారు. జరిగితే మాత్రం బెర్త్ దక్కేలా ప్రయత్నాలు చేసుకుంటున్నారట. మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వస్తున్నా..ఎమ్మెల్యేలు తమ ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదన్న చర్చ జరుగుతోంది. అనుకూలంగా ఉన్న వర్గాల ద్వారా ఢిల్లీ పెద్దలతో రాయబారం నడుపుతున్నారట. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డితో టచ్ లో ఉంటూనే మరోవైపు ఢిల్లీ పెద్దలను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. మంత్రివర్గంలో ఈ సారి ఎలాగైనా తమ పేరు ఉండాల్సిందేనని కొందరు సీనియర్లు పట్టుదలతో ఉన్నారట.మొత్తానికి నల్లగొండ పాలిటిక్స్ కారణంగా మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వస్తోంది. ఈ విషయంలో పార్టీ పెద్దలు ఎలా డీల్ చేస్తారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని బుజ్జగిస్తారా.. లేదా క్యాబినేట్‌టోకి తీసుకుంటారా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా మారింది. మంత్రివర్గ విస్తరణకు ఎప్పుడు ముహూర్తం తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడక తప్పదు

# పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి: జిల్లాలో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధరణి పెండింగ్ దరఖాస్తులు, జాతీయ రహదారుల భూ సేకరణ చెల్లింపుల పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష డివిజన్ వారిగా పెండింగ్ ధరణి దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ధరణి వెబ్ సైట్ లో నూతనంగా పెండింగ్ మ్యూటేషన్, పెండింగ్ సక్సెషన్ మొదలగు మాడ్యుల్స్ ను ప్రభుత్వం జిల్లా కలెక్టర్ నుంచి అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులకు బదలాయించ డం జరిగిందని, వీటిని వేగవంతంగా క్లియర్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మంచిర్యాల వరంగల్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ఆర్బిట్రేషన్ సంబంధిత రైతులకు వేగవంతంగా చెల్లింపులు చేయాలని, జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరగా గ్రౌండ్ అయ్యే విధంగా అధికారులు నేషనల్ హైవే అథారిటీకి పూర్తి సహ కారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్ , గోదావరిఖని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు , అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై పోరులో వరంగల్ యువకుడు

వరంగల్: సమాజంలో అవినీతిని రూపుమాపేందుకు వరంగల్ కు చెందిన ఓ యువకుడు దాదాపు పది సంవత్సరాల నుంచి ఒంటరి పోరు చేస్తున్నాడు. 'జ్వాలా' అవినీతి నిరోధక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, దాని ఆధ్వర్యంలో లంచాలను నిర్మూలించాలనే ఉద్దేశంతో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు.ప్రభుత్వ కార్యాలయా ల్లో ఏ పని కావాలన్నా ఇప్పుడు లంచాలతోనే ఎక్కువ పని! కొందరు ఆఫీసర్లు సంతకం పెట్టాలన్నా.. మన ఫైల్ ముందుకు కదలాలన్నా చేతులు తడపక తప్పని పరిస్థితి. ఇటీవల అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పట్టుబడుతున్న అధికారుల ఉదంతాలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తుండగా.. సమాజంలో అవినీతిని రూపుమాపేందుకు వరంగల్ కు చెందిన ఓ యువకుడు దాదాపు పది సంవత్సరాల నుంచి ఒంటరి పోరు చేస్తున్నాడు.'జ్వాలా' అవినీతి నిరోధక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, దాని ఆధ్వర్యంలో లంచాలను నిర్మూలించాలనే ఉద్దేశంతో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. లోక్ సత్తా ఉద్యమ సంస్థతో కలిసి ఏటా అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు నిజాయితీగా విధులు నిర్వర్తించే అధికారులను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాడు. ఒక్కో సంవత్సరం ఒక్కో విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ అవినీతి నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాడు.వరంగల్ జిల్లా ఆరెపల్లి గ్రామానికి చెందిన సుంకరి ప్రశాంత్.. పీజీ వరకు చదివాడు. వ్యక్తిగతం సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగిన ఆయన.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, లంచగొండితనాన్ని కొన్ని సందర్భాల్లో స్వయంగా ఎదుర్కొన్నాడు. ఆ తరువాత అవినీతిపై పోరు నడిపించడానికి నిర్ణయించుకుని, 'జ్వాలా' పేరున అవినీతి వ్యతిరేక స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. తన స్నేహితులు, సన్నిహితులతో కలిసి ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న నిర్వహించే అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని వినూత్న రీతిలో నిర్వహిస్తున్నాడు. ముందుగా హనుమకొండ వేయి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఎన్సీసీ క్యాడెట్ల సహాయంతో ర్యాలీ నిర్వహించడంతో పాటు అవినీతికి వ్యతిరేకంగా ప్లకార్డులు కూడా ప్రదర్శిస్తుంటాడు.అవినీతిపై యుద్ధం చేస్తున్న సుంకరి ప్రశాంత్.. ఇదివరకు అవినీతికి పాల్పడిన అధికారులను పట్టించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాగా అవినీతికి పాల్పడుతున్న అధికారుల్లో పరివర్తన రావడంతో పాటు లంచగొండి తనాన్ని నిర్మూలించేందుకు జనాల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రశాంత్ ఏటా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. మూడేళ్ల కిందట అవినీతికి పాల్పడుతున్న అధికారుల వేషం వేయించి గాడిదలతో ఊరేగింపు నిర్వహించాడు. ఆ తరువాత లంచం తీసుకోకుండా, ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న అధికారులను వరంగల్ కు రప్పించి, వారిని గుర్రాలపై ఊరేగించి సన్మానించాడు. ఎన్పీడీసీఎల్ లో ఏడీఈ గా పని చేస్తున్న పొడేటి అశోక్ తాను లంచం తీసుకోకుండా సేవలందిస్తుండటం, తన ఆఫీస్ లో కూడా లంచం ఇవ్వొద్దు అంటూ బోర్డులు ఏర్పాటు చేసుకుని మరీ విధులు నిర్వర్తిస్తుం డటంతో ఆయనను పిలిపించి సన్మాన కార్యక్రమాలు నిర్వహించాడు. అంతేగాకుండా గతంలో సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలో ఏఆర్ఐగా పని చేసిన సీహెచ్.నరసయ్య కూడా పైసా లంచం తీసుకోకుండా పనులు చేస్తుండటంతో విషయం తెలుసుకున్న ప్రశాంత్.. ఆయనను కూడా సన్మానించాడు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రశాంత్ వినూత్న కార్యక్రమా న్ని నిర్వహించాడు. నీతి నిజాయితీ ఆసుపత్రిలో వెంటిలేటర్ పై ఉంటే.. అవినీతి, అక్రమాలు బాడీ బిల్డర్ గా రోజురోజుకు ముదిరి పోతున్నాయనే డిఫరెంట్ కాన్సెప్ట్ తో వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్క ర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించాడు. ఇందుకు ఒక వ్యక్తికి నీతి, నిజాయితీ అనే పేరు పెట్టి, అంబులెన్స్ లో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తూ.. అవినీతి, అక్రమాలను సూచించే బాడీ బిల్డర్లతో నగరంలో ర్యాలీ నిర్వహించాడు. వినూత్నంగా ర్యాలీ నిర్వహించడంతో వాహన దారులు, రాకపోకలు సాగించే ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జ్వాలా అవినీతి వ్యతిరేక స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ మాట్లాడుతూ దేశంలో అవినీతి రాజ్యం ఏలుతోందన్నారు. నీతి, నిజాయితీ వెంటిలేటర్ పై కొట్టుమిట్టాడుతుంటే అవినీతి బాడీ బిల్డర్ గా స్ట్రాంగ్ అవుతోందన్నారు. అవినీతి అధికారుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ఫాస్ట్ కోర్టులు ఏర్పాటు చేయాలని, లంచగొండులపై కఠిన చర్యలు తీసుకుంటేనే అవినీతి నిర్మూలన సాధ్యం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు అవినీతి, లంచగొండి తనానికి పాల్పడబోమంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రమాణాలు చేయాలని, ఏసీబీ ట్రాప్ అయిన అధికారులను సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. డయల్ 100 మాదిరిగానే డయల్ 1064 ద్వారా కూడా క్విక్ యాక్షన్ ఉండేలా ప్రభుత్వాలు చొరవ చూపాలని, మారుతున్న టెక్నాలజీ ఆధారంగా అవినీతి అధికారులపై నిఘా పెట్టి, దోషులను శిక్షించాలని కోరారు. దాదాపు పదేళ్లుగా ప్రశాంత్.. అవినీతిపై ఒంటరి పోరు చేస్తుండగా.. ఆయన ప్రయత్నాలతో కొందరిలోనైనా మార్పు వస్తుందేమో చూద్దాం.

# ఖమ్మం జిల్లా సమస్యలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు బీఆర్ఎస్ ఎంపీల వినతి

ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు స్టేషన్లలో నెలకొన్న రైల్వే సంబంధిత సమస్యలపై ఢిల్లీలో సోమవారం బీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు వినతి అందజేశారు. పార్లమెంటరీ పార్టీ నాయకుడు కేఆర్ సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ దామోదర్ రావులు రైల్వే మంత్రిని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భద్రాచలం రోడ్ స్టేషన్ (కొత్తగూడెం) నుంచి హైదరాబాద్ కు కోవిడ్ సమయంలో రద్దు చేసిన రైళ్లతో పాటు, అదనంగా మరికొన్ని రైళ్లు నడపాలని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతికి ప్రత్యేక రైలు నడపాలని కోరారు.

గాంధీపురం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం ఎత్తు పెంచి, ఆధునీకరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కారేపల్లి స్టేషన్ ను అభివృద్ధి చేయడం తో పాటు గతంలో ఉన్న రిజర్వేషన్ కౌంటర్ ను పునరుద్ధరించాలని కోరారు. ఖమ్మం స్టేషన్లో బీహార్, జైపూర్ వెళ్లే రైళ్లను ఆపాలని వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ఎంపీల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి ఆయా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# మంత్రుల పనితీరుపై నివేదికలు

హైదరాబాద్: ఏడాది పాలన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇక నుంచి ప్రతి అంశంపై పట్టు సాధించే యోచనలో ఉన్నారు. అటు అధికారులు..ఇటు క్యాబినెట్ సహచరుల పనితీరు మీద ఇప్పటికే ఇంటెలిజెన్స్ రిపోర్ట్ తెప్పించుకున్న సీఎం మార్పులు, చేర్పులు చేయాలని భావిస్తున్నారట. తన దూకుడుకు తగ్గట్లుగా పనిచేయని అధికారుల తీరుపై ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేశారట.త్వరలోనే కొందరు ఉన్నతస్థాయి అధికారుల బదిలీలు కూడా ఉంటాయని అంటున్నారు. అంతేకాదు ఏడాది పాలనలో అమాత్యుల పనితీరు ఎలా ఉందని కూడా రేవంత్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. పలువురు మంత్రుల పనితీరుపై ప్రజల్లో నెగెటివ్ టాక్ ఉందని సీఎం దృష్టికి వచ్చిందంటున్నారు. ఒకరిద్దరు మంత్రుల అవినీతి ఆరోపణల వ్యవహారం ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లిందట.ఆయా శాఖల్లో మంత్రులు సాధించిన విజయాలు, ఫెయిల్యూర్స్‌పై ముఖ్యమంత్రి కార్యాలయం రిపోర్ట్ తయారు చేసిందని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరు మంత్రుల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. పలువురు మినిస్టర్ల అవినీతి భాగోతంపై సీరియస్‌గా ఉన్న ముఖ్యమంత్రి..మంత్రివర్గ విస్తరణలో వారి శాఖలను మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఇద్దరు ముగ్గురు మంత్రులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఇంటెలిజెన్స్ అధికారులు సీఎంకు రిపోర్టు ఇచ్చారట.ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి టేబుల్ మీద ఉన్న ఐబీ నివేదికలో మంత్రుల అక్రమాలు, అవినీతికి సంబంధించిన వివరాలు ఉన్నట్లు సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా మంత్రులపై ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై రేవంత్ సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడుతూ..అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మంత్రుల అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి సిద్ధమవుతున్నారని టాక్.త్వరలో మంత్రివర్గ విస్తరణ జరగనుంది. ఆరు బెర్తులను భర్తీ చేయబోతున్నారు. అదే సమయంలో పనితీరు సరిగా లేని మంత్రుల శాఖలను మార్చే అవకాశం ఉందంటున్నారు. కొందరిని అయితే తప్పించే అవకాశం కూడా లేకపోలేదన్న చర్చ జరుగుతోంది. దీంతో ఏ మంత్రి శాఖ మారబోతుంది..కరప్షన్ అలిగేషన్స్ ఎదుర్కొంటున్న అమాత్యులు ఎవరనే దానిపై సెక్రటేరియట్‌లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కొందరు మంత్రుల మీద వచ్చిన నెగెటివ్ ఫీడ్ బ్యాక్‌ను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లబోతున్నారట సీఎం రేవంత్. ఇవాళ్టితో ప్రజావిజయోత్సవాలు ముగియడంతో తర్వాత సెక్రటేరియట్‌లో పూర్తిస్థాయి ప్రక్షాళనకు రెడీ అవుతున్నారట సీఎం. అధికార యంత్రాంగాన్ని తన గ్రిప్‌లోకి తెచ్చుకుని పాలనను పరుగులు పెట్టించాలని ఫిక్స్ అయ్యారట. అందులో భాగంగా మంత్రుల పనితీరు, వాళ్ల మీద వస్తున్న ఆరోపణలపై ఓ కన్నేసి పెట్టారని అంటున్నారు. అయితే పబ్లిక్ నుంచి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిన మంత్రులు, కరప్షన్ అలిగేషన్స్ ఉన్న మినిస్టర్ల విషయంలో ఎలాంటి స్టెప్ తీసుకోవాలనే దానిపై సన్నిహితులతో చర్చిస్తున్నారట సీఎం. ప్రజా విజయోత్సవాలు ముగిశాక.. హైకమాండ్ పెద్దల దృష్టికి తీసుకెళ్లి మార్పులు, చేర్పులకు శ్రీకారం చుడుతారని అంటున్నారు. ఏ మంత్రి శాఖ మారబోతుందో..అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి.

# విగ్రహ మార్పు...ఎవరికి మైలేజ్... ఎవరికి డ్యామేజ్


హైదరాబాద్: విగ్రహాలు స్ఫూర్తిదాయకాలు.. చరిత్రపుటలపై చేసిన చెరుగని సంతకాలు.. భావజాలానికి ప్రతీకలు.. భావోద్వేగాలకు వేదికలు. అయితే ఈ భావజాల జాతరలో తెలంగాణ తల్లి విగ్రహ రూపం రాజకీయ రగడను రాజేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహంలో రాచరిక పోకడలు ఉన్నాయని కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ తల్లికి కొత్త రూపం ఇచ్చింది. దీంతో విగ్రహం చుట్టూ వివాదం మొదలైంది.దేవత వేరు, తల్లి వేరు అంటూ కాంగ్రెసె సర్కార్ బలంగా వినిపిస్తోంది. తల్లి ప్రతిరూపంగా ఉండాలనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని సాదాసీద రూపం ఇచ్చామని సీఎం అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. తల్లి వజ్ర వైడుర్యాలతో భుజకీర్తులు, కిరీటాలతో ఉండాలా అని సీఎం ప్రశ్నించారు. ఒక వ్యక్తి, ఒక పార్టీ ఆలోచనే తెలంగాణ ఆలోచనగా కొందరు చెప్తున్నారని అన్నారు.ఈ విగ్రహ రూపంపై బీఆర్ఎస్, బీజేపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. విగ్రహంలో బతుకమ్మను విస్మరించి.. తెలంగాణ సంస్కృతినే అవమానించారని ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. పైగా కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తును ప్రతిబింబించేలా విగ్రహాన్ని రూపొందించారు తప్పా.. తెలంగాణ తల్లి విగ్రహం కానే కాదని అంటున్నాయి. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తల్లి విగ్రహమే అని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తు న్నారు.మన దేశంలో విగ్రహ రాజకీయాలు కొత్తేమి కాదు. కుల, మత, ప్రాంతీయ, సాంఘీక, రాజకీయ ధృక్పదానికి ఎన్నో విగ్రహాలు ప్రతీకలుగా నిలిచాయి. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం విగ్రహాలను వాడుకున్న సందర్భాలు కోకొల్లలు. విగ్రహ ఏర్పాటు నుంచి విధ్వంసాల వరకు ఎన్నో ఘటనలు సాక్ష్యాలుగా నిలిచాయి. మొదట స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు వారి త్యాగాలకు గుర్తుగా ఏర్పాటు చేసుకున్నాం. తర్వాత రాజకీయ నేతల విగ్రహాలు రోడ్లపై కొలువు తీరాయి. ఇలా దేశంలో పెద్ద ఎత్తున విగ్రహ రాజకీయాలు మొదల య్యాయి. ఈ విగ్రహాల ద్వారా తమ పార్టీ భావజాలాన్ని తీసుకువెళ్లడమే ప్రధాన ఉద్దేశం. చివరకు ఇవన్నీ ఓట్ బ్యాంకు రాజకీయాల కోసమే అని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు.తెలంగాణ ఉద్యమ సమయంలో తెలుగు తల్లికి పోటీగా ఉద్యమకారులు తెలంగాణ తల్లి భావన తీసుకు వచ్చారు. కేసీఆర్ సహా ఉద్యమ నేతలు తెలంగాణ తల్లి విగ్రహ భావజా లాన్ని తెలుగు తల్లికి పోటీగా తీసుకువచ్చి తెలంగాణ వ్యాప్తంగా ఈ విగ్రహాల ప్రతిష్టాపన చేశారు. ప్రతీ ఉద్యమ కార్యక్రమా నికి ముందు తెలంగాణ తల్లికి అంజలి ఘటించడం, జయ జయహే తెలంగాణ పాట ఆలపించడం ఉద్యమంలో భాగమైంది. ఇలా తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది.పదేళ్ల పాలన తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహంలోను, ప్రభుత్వ అధికారిక చిహ్నంలో మార్పులు తేవాలని నిర్ణయించారు. అందులో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహంలో కొన్ని మార్పులు చేశారు. దీన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఉద్యమం లో ప్రాచుర్యం పొందిన తెలంగాణ తల్లి విగ్రహం కాకుండా చేయి గుర్తుతో ఉన్న విగ్రహంగా మార్చారంటూ విమర్శలు చేస్తోంది. అయితే తిరిగి తాము అధికారంలోకి వస్తే మళ్లీ పాత తల్లి విగ్రహాన్నే ప్రతిష్టిస్తా మని చెబుతోంది.మొత్తంగా తెలంగాణలో విగ్రహ రాజకీయం ముదిరి రెండు పార్టీల మధ్య మరింత చిచ్చు రాజేస్తోంది. ఈ విగ్రహ వివాదంతో ఏ పార్టీకి ఎంత లబ్ధి చేకూరుతుందన్నదానికి భవిష్యత్తే సమాధానం చెప్పాలి.

# ఇక ఇంటి నుంచి పౌరసేవలు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెప్పింది. పౌరసేవలను మరింత సులభతరం చేయనుంది. సరికొత్త మొబైల్ యాప్ ను అందుబాటులోకి తేనుంది. దీని ద్వారా పౌరులకు సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. ఈ యాప్‌తో ఇంటి వద్దే పౌర సేవలు అందనున్నాయి.తెలంగాణ ప్రజలు ఇంటి నుంచే పౌరసేవలు పొందేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా మీసేవ యాప్‌ను ఐటీశాఖ సిద్ధం చేసింది. ఈ యాప్ ద్వారా దాదాపు 150 రకాల పౌర సేవలను పొందవచ్చు. హైదరాబాద్ మెట్రో స్టేషన్లు, షాపింగ్ మాల్స్, కలెక్టరేట్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ఇంటరాక్టివ్ కియోస్క్ ద్వారా కూడా ప్రజలు పౌర సేవలు పొందవచ్చు. డిజిటల్ చెల్లింపులు, అప్లికేషన్లు, సర్టిఫికెట్‌లు ప్రింట్ తీసుకునే అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది.మీసేవలో తెలంగాణ ప్రభుత్వం కొత్త సర్వీసులను చేర్చింది. దివ్యాంగుల గుర్తింపు కార్డులు, వృద్ధుల సంక్షేమ కేసుల పర్యవేక్షణ, సదరం సర్టిఫికెట్ల జారీ, టూరిజం హోటల్స్, ప్యాకేజీల బుకింగ్, పర్మిట్ల రెన్యూవల్, కొత్తవి జారీ చేయటం, వాల్టా చట్టం కింద చెట్ల తొలగింపు, తరలించేందుకు అనుమతులకు సంబంధించిన సర్వీసులను మీసేవలో చేర్చింది. ఈ నిర్ణయంతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పింది.గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ విప్లవానికి రేవంత్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ అందుబాటులోకి తీసుకురానుంది. లక్షల ఇళ్లకు దశలవారీగా ప్రభుత్వం ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించనుంది. ఈ కనెక్షన్ తీసుకుంటే వర్చువల్ నెట్‌వర్క్‌తో పాటు.. టెలిఫోన్, తెలుగు ఓటీటీలను ప్రజలు చూడటానికి వీలుంటుంది. మొదటి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని 2,096 పంచాయతీల్లో దీన్ని అమలు చేయనున్నారు.ఈ కనెక్షన్ తీసుకుంటే ప్రతి ఇంట్లో ఉన్న టీవీనే కంప్యూటర్‌గా మారుతుందని అధికారులు చెబుతున్నారు. 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో కనెక్షన్ ఇస్తారని చెబుతున్నారు. ఈ కనెక్షన్ ద్వారా చెల్లింపులు కూడా చేయవచ్చని.. గ్రామంలోని అన్ని కార్యాలయాలకు, స్కూళ్లకు కూడా కనెక్షన్ ఇవ్వనున్నట్టు అధికారులు వివరిస్తున్నారు. టీవీనే కంప్యూటర్‌గా మారుతుంది కాబట్టి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే అవకాశముంది.ఈ కనెక్షన్ తీసుకునేవారితో హైదరాబాద్ నుంచే ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడే వీలు కలుగుతుందని.. అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామంలోనూ జంక్షన్లు, ఇతర చోట్ల కూడా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. ఫైబర్ నెట్‌తో అనుసంధానం చేయబోతున్నారు. ఇవి ప్రతి పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమవుతాయని అధికారులు వివరిస్తున్నారు.

# ఈనెల 14న జరుగు జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- సమయాన్ని డబ్బులను ఆదాచేసుకోవాలి
- కక్ష కారుణ్యాలతో ఏమీ సాధించలేము.
- రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లే
- లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుంది.
- కొట్టుకుంటే ఒకరే గెలుస్తారు రాజీ పడితే ఇద్దరు గెలుస్తారు
- పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ



సిద్దిపేట: 14-12-2024 నాడు జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో మరియు ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# హెచ్ఎం పోస్టులకు పదోన్నతులు కల్పించాలి

**- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్‌కు పీఆర్టీయూటీఎస్ వినతి**



హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) పోస్టులను అడ్‌హక్ పద్ధతిలో పదోన్నతులతో భర్తీ చేయాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎన్ శ్రీధర్‌ను హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పుల్గం దామోదర్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, మిగిలిపోయిన పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని సూచిం చారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లిం చాలని తెలిపారు. సమగ్ర శిక్ష పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, విద్యాసంస్థల పటిష్టత కోసం ప్రభుత్వ నిర్ణయాలకు ఎల్లవేళలా సహకారం అందిస్తామని వివరించారు. రెండు రోజుల్లో విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి తగు నిర్ణయాలు తీసుకుంటామని శ్రీధర్ హామీ ఇచ్చారని తెలిపారు.

# రైతులను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు కృషి

సిద్దిపేట: రైతులను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు కృషికల్ప ఫౌండేషన్ కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి పేర్కొన్నారు. సోమవారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో వ్యవసాయ మరియు ఉద్యాన శాఖ సంయుక్తంగా క్రిషికల్ప మరియు జిల్లా యంత్రాంగం సహకారంతో కలెక్టరేట్ లో నిర్వహించిన, అగ్రిసినర్జీ 2024 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి ముఖ్య అతిధిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 20+ అగ్రిటెక్ స్టార్టప్ల ప్రదర్శన తిలకించారు. రైతులు, ఎఫ్పిఓ సీఈవోలు, డైరెక్టర్లు మరియు విద్యార్థులతో మాట్లాడారు. నూతన వ్యవసాయ మరియు ఉద్యాన పరిష్కారాల ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, విజయ గాథలు మరియు మార్కెట్ లింకేజీ మార్గదర్శనల పై చర్చించి రైతులకు ఎఫ్ పీఓ ల ద్వారా మార్కెటింగ్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సరైన ధరకు అమ్ముకునేందుకు ఎఫ్పిఓ ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్స్ ల ద్వారా కృషికల్ప ఫౌండేషన్ సహకరిస్తుందని అన్నారు. మరియు ఎఫ్ పిఓ ల ద్వారా ఫెస్టిసైడ్లను అందించి వాటి వినియోగం మరియు మార్కెట్ లో ఎక్కువ డిమాండ్ ఉన్న పంటలను ప్రోత్సహించి ఎక్కువ దిగుబడినిచ్చే పంటలు, సాగుబడిలో అధునాతన సాంకేతిక పద్ధతుల వినియోగం తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించి రైతులను వారి ఉత్పత్తులను అమ్ముకోవడంలో వ్యాపారవేత్తలుగా మార్చడానికి కృషికల్ప ఫౌండేషన్ ద్వారా కృషి జరుగుతుందని అన్నారు. జిల్లాలోని అక్కన్నపేట మండలంలో ప్రహర్ష మరియు ప్రసిద్ధ ఎఫ్ పిఓ ల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నదని అన్నారు.

ఇలాంటి అదునాతన పద్దతులు జిల్లాలోని రైతులకు ప్రయోజనకరంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆదర్శ రైతులు, ఎఫ్ పిఓలు, విద్యార్థులు ఇలాంటి వాటిపై స్పష్టమైన అవగాహనను పెంపొందించుకోవాలని అన్నారు. దాంతో పాటు రైతులు ఆసక్తిని కనబరిచి బృందంగా ఏర్పడి ఎఫ్.పి.ఓ. లుగా ఏర్పడాలని ఎఫ్ పిఓ ల కొరకు జిల్లాలోని వంటిమామిడి వ్యవసాయ ఉత్పత్తుల కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు కృషికల్ప ఫౌండేషన్ పరిశీలించాలని అన్నారు. జిల్లాలో గల ప్రహర్ష మరియు ప్రసిద్ధ ఎఫ్.పి.ఓ.ల ద్వారా సేకరించిన వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి సుముఖంగా ఉన్న ఇలా అగ్రి కంపెనీతో వివిధ సంస్థలు రైతులకు అందించే అవకాశాలను గురించి వివరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, కృషికల్ప ఫౌండేషన్ సిఈఓ సిఎం.పాటిల్, నాబార్డ్ డిడియం నిఖిల్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, వ్యవసాయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# చేనేత కార్మికుల అకౌంట్లలోకి డబ్బులు!

హైదరాబాద్: తెలంగాణలో నేతన్నలు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఆర్థిక సమస్యలతో ఎంతోమంది తనువు చాలిస్తున్నారు. అటు ఆశించిన స్థాయిలో రాబడి లేదు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేతన్నలకు ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించింది. సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో నేతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు సీఎం ఆదేశాలతో అధికారులు కదిలారు. చేనేత శాఖ రుణమాఫీపై కసరత్తు చేపట్టిందిరుణమాఫీ అమలుకు రూ.58 కోట్లు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు చేనేత శాఖ ప్రతిపాదనలు రూపొందించి నిధుల విడుదల కోసం ఆర్థికశాఖకు దస్త్రం పంపింది.గత ప్రభుత్వం 2017 మార్చి 31 వరకు రుణమాఫీ అమలు చేసింది. దీంతో 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణలోని బ్యాంకులు, చేనేత కార్మికులు, సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల సమాచారాన్ని.. జిల్లాల నుంచి ప్రభుత్వం సేకరించింది.ఆ వివరాల ప్రకారం.. 7,250 మంది కార్మికులకు రూ.40.10 కోట్ల వ్యక్తిగత రుణాలు, 91 చేనేత సహకార సంఘాలపై రూ.18 కోట్ల మేరకు అప్పులున్నట్లు తేలింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో.. రుణ మాఫీకి రూ.58.10 కోట్లు అవసరమని చేనేత శాఖ ప్రతిపాదనలు పంపింది. కార్మికులు, సంఘాల వారీగా రుణ జాబితాను ఆర్థికశాఖకు అందజేసింది.ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లభిస్తే.. రుణమాఫీ ప్రక్రియను చేపట్టేందుకు చేనేత శాఖ సిద్ధంగా ఉంది.చేనేత రుణమాఫీ కార్యక్రమాన్ని కార్మికులతో భారీఎత్తున నిర్వహించాలని రేవంత్ సర్కారు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ కార్యక్రమంలోనే రేవంత్ రుణ మాఫీ నిధులను విడుదల చేస్తారని సమాచారం.తెలంగాణలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది చేనేత రంగంలో జీవనోపాధి పొందుతున్నారని.. అధికారులు చెబుతున్నారు. వస్త్రాల తయారీలో వస్తున్న అధునాతన సాంకేతిక మార్పుల కారణంగా.. చేనేత రంగంలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నూతన డిజైన్లు, వైవిధ్యతతో వస్త్రాల తయారీలో ముందుకెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్నకు చేయూత ద్వారా.. చేనేత కార్మికుడు పొదుపు చేసుకున్న డబ్బుకు రెండింతలు ప్రభుత్వం వాటాగా వారి అకౌంట్లో జమచేస్తోందని అధికారులు వివరిస్తున్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**- అన్ని పారామీటర్లలో జిల్లాను ముందు స్థానంలో వుంచండి**

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేసి అన్ని పారామీటర్లలో జిల్లాను ముందు ముందు స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో కోఆర్డినేషన్ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్యసాధనను అధికార బృందాలు క్షేత్రస్థాయిలో సమయస్ఫూర్తితో పనిచేసి అన్ని పారామీటర్లలో ముందుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఆర్డిఏ, డిఎంహెచ్వో ఇతర శాఖలు ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్య సాధనలో కుంటు పడిన అంశాలను తన దృష్టికి తీసుకువచ్చి సమీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 11వ తేదీ కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో జిల్లాను అన్ని పారామీటర్లలో దిగువ స్థానంలో వుంచితే సహించేది లేదన్నారు. గత నెల రోజుల నుండి పారామీటర్ల ప్రగతిపై పదేపదే చెప్తున్నా ఆశించిన రీతిలో ఫలితాలు కనపడడం లేదన్నారు. కలెక్టర్ల సదస్సులో ప్రతి అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి గారు స్లాట్లు ఇచ్చి క్షుణ్ణంగా సమీక్షిస్తున్న నేపథ్యంలో అధికారులు నిర్దేశిత లక్ష్యసాధనపై దృష్టి సారించి నివేదికలు ఇవ్వాలన్నారు. జిల్లాలో వరి, ఇతర ధాన్యపు పంట దిగుబడులను రోడ్లపై అరవేస్తున్నారని అకాల వర్ష కారణంగా ధాన్యం తడవకుండా రైతులను అప్రమత్తం చేయాలని విలేజ్ గ్రామ వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ పంట భీమా ప్రీమియం చెల్లింపు కింద వివిధ పంటలకు తక్కువ రుసుమును ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తే దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లిస్తుందన్న అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. తొలిరోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై 430 గ్రీవెన్స్ వచ్చాయని వీటన్నింటిని ఆన్లైన్ చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భూ సమస్యలతో పాటు స్వీకరించిన ఇతర సమస్యలను కూడా అదర్ సోర్సెస్ కింద అప్లోడ్ చేసుకుని పరిశీలించాలన్నారు. ఆదివారం జరిగిన జడ్పీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన దొర్నిపాడు బాయ్స్ హాస్టల్ సమీపంలో ఉన్న వైన్ షాపుపై చేసిన ఫిర్యాదుపై నిబంధనల ప్రకారం పరిశీలించి సంబంధిత మద్య దుకాణంపై వెంటనే నివేదికలు ఇవ్వాలని ఎక్సైజ్ సూపరిండెంటెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొవలని డిఆర్ఓ, ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. మెగా పేరెంట్ టీచర్ల సమావేశాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు సంబంధించి అధికారులను కలెక్టర్ అభినందించారు. జాయింట్ కలెక్టర్ సి విష్ణుచరణ్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల డేటాను కూడా వేగవంతం చేయాలన్నారు.

# నేడు టీఓఏ ఎన్నికల ఫలితాలు

**– ఓట్ల లెక్కింపునకు న్యాయస్థానం గ్రీన్‌సిగల్**

హైదరాబాద్ : తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) ఎన్నికల ఈ నెల 21న ముగియగా, ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడిపై సిటీ సివిల్ కోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై తెలంగాణ ఒలింపిక్ సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించగా తాజాగా గ్రీన్ సిగల్ లభించినట్టు టీఓఏ ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్ తెలిపారు. ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో నేడు ఉదయం 10.30 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అధ్యక్ష పదవికి ఏపీ జితేందర్ రెడ్డి, చాముండేశ్వరనాథ్‌లు పోటీపడగా.. ప్రధాన కార్యదర్శి పదవికి మల్లారెడ్డి, బాబు రావు పోటీపడగా, కోశాధికారి పదవి కోసం సతీశ్ గౌడ్, ప్రదీప్ కుమార్‌లు పోటీపడ్డారు. ఉపాధ్యక్ష పదవులు సహా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఇప్పటికే ఏకగ్రీవమైన సంగతి తెలిసిందే. నూతనంగా ఎన్నిక కానున్న ఆఫీస్ బేరర్లు నాలుగేండ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

# హర్షిత్ ఎంపికపై వివాదం. కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: రెండో టెస్టులో భారత జట్టు ఘోరంగా ఓడిపోవడంతో కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు కోచ్ గంభీర్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఇద్దరు ఆటగాళ్లు అరంగ్రేటం చేశారు. హైదరాబాదీ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి బ్యాటింగ్‌లో మెరుపు మెరిపించాడు. కానీ అది ఓటమి నుంచి తప్పించలేకపోయింది. నితీశ్ కుమార్ రెడ్డిపై భారీ అంచనాలు ఉన్నాయి. బౌలింగ్‌లో రెండు వికెట్లు తీసి బ్యాటింగ్‌లో పర్వాలేదనిపించాడు. హర్షిత్ రాణా తొలి టెస్టులో రాణించినప్పటికి రెండో టెస్టులో ఘోరంగా విఫలమయ్యాడు. దీంతో హర్షిత్ పై విమర్శలు వస్తున్నాయి. హర్షిత్ బదులు ఆకాశ్ దీప్, ప్రసిధ్ కృష్ణను తీసుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. హర్షిత్ కోల్‌కతా నైట్‌రైడర్స్ బౌలర్ కావడంతో జట్టులోకి తీసుకొని ఉంటారని క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. విమర్శలపై టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ తనదైన శైలిలో చురకలంటించాడు. టీమిండియాలో ఎవరు ఉండాలనేది కొందరు నిర్ణయం తీసుకుంటారని, అది తన పని కాదన్నారు. తాను చెప్పినంత మాత్రాన జట్టులో పెద్దగా మార్పులు ఉండవన్నారు. ఇప్పటికైనా టీమిండియా జట్టు ఎంపికలో మంచి నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నానని తెలిపారు. బిసిసిఐ తీసుకునే నిర్ణయాలపై తాను జడ్జ్ చేయలేనని వివరణ ఇచ్చారు. అసలు ఇలాంటి విషయాలపై మనం మాట్లాడడం సరికాదని, టీమిండియా జట్టు మాజీ సహచరులే ఈ నిర్ణయాలు తీసుకోవడంతో పాటు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటారని కపిల్ దేవ్ ఎద్దేవా చేశారు. గబ్బాటెస్టులో హర్షిత్ రాణాకు బదులుగా ఆకాశ్ దీప్ తీసుకుంటే బాగుంటుందని మాజీ ఆటగాడు మంజ్రేకర్ సెలక్షన్ కమిటీకి సలహా ఇచ్చాడు.

# సాధన షురూ!

**– నెట్స్‌లో భారత క్రికెటర్ల ప్రాక్టీస్**

**– 14 నుంచి ఆసీస్‌తో మూడో టెస్టు**




బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆసక్తికరంగా మారింది. పెర్త్ టెస్టులో భారత్ 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించగా.. ఆడిలైడ్ టెస్టులో 10 వికెట్ల తేడాతో గెలుపొందిన ఆస్ట్రేలియా లెక్క సమం చేసింది. ప్రపంచ క్రికెట్‌లో అగ్రజట్లు, సమవుజ్జీల సమరం ప్రస్తుతం 1-1తో రసకందాయంలో పడింది. స్వదేశంలో వెనుకంజ వేసినా.. పుంజుకోవటం కంగారూలకు కొత్త విషయం. కానీ విదేశీ పర్యటనల్లో భారత్ వెనుకంజ వేసినా పుంజుకున్న సందర్భాలు ఎక్కువ. భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు ఈ నెల 14 నుంచి బ్రిస్బేన్‌లో ఆరంభం కానుంది. 2018-19, 2020-21 పర్యటనల్లో ఆసీస్‌పై అసమాన విజయాలు సాధించి సిరీస్ సొంతం చేసుకున్న టీమ్ ఇండియా.. తాజా పర్యటనలో హ్యాట్రిక్‌పై కన్నేసింది. పింక్ బాల్ టెస్టు పరాజయం నుంచి బయటపడిన రోహిత్‌సేన.. మంగళవారం నెట్స్‌లో సాధన షురూ చేసింది.

ప్రాక్టీస్ మొదలైంది

భారత క్రికెట్ విజయావకాశాలను బ్యాటర్లే ఎక్కువగా మోశారు. ఇప్పుడు పరిస్థితులు తారుమారు అయ్యాయి. గెలుపు భారం ప్రధానంగా బౌలర్లపై పడుతోంది. స్వదేశీ, విదేశీ టెస్టులో సంబంధం లేకుండా బ్యాటింగ్ లైనప్ నిలకడగా నిరాశపరుస్తోంది. పేసర్లు, స్పిన్నర్లు మెరిస్తేనే టీమ్ ఇండియా గెలుపు దిశగా సాగుతోంది. ఆడిలైడ్ టెస్టులో బౌలర్లు సైతం అంచనాలను అందుకోలేదు. ఫలితంగా, భారత్ దారుణ పరాజయం చవిచూసింది. సాధారణంగా ఆస్ట్రేలియా గడ్డపై తొలి ఇన్నింగ్స్‌లో పరుగుల వేట కష్టసాధ్యం. భారత్ సహా ఇతర జట్లు సైతం కంగారూలపై తొలి ఇన్నింగ్స్‌లో తడబాటుకు గురయ్యాయి. టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్ బలహీనత అధిగమించాలి. అప్పుడే, చివరి మూడు టెస్టుల్లో ఆతిథ్య ఆసీస్‌పై ఒత్తిడి పెంచడానికి అవకాశం ఏర్పడుతుంది. సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఈ బాధ్యతను తీసుకోవాలి. యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ మెరిస్తే ఈ సమస్య నుంచి భారత్ గట్టెక్కటం పెద్ద విషయం కాబోదు.

ఆడిలైడ్ టెస్టు మూడు రోజుల్లోనే ముగియటంతో.. మంగళవారం భారత క్రికెటర్లు మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టారు. బ్యాటర్లు, బౌలర్లు అందరూ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, కెఎల్ రాహుల్ సహా విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, వాషింగ్టన్ సందర్‌లు నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేశారు. త్రోడౌన్స్‌లో పేస్, స్పిన్‌ను ఆడారు. విరాట్ కోహ్లితో చీఫ్ కోచ్ గౌతం గంభీర్ మాట్లాడుతూ కనిపించారు. చీఫ్ సెలక్టర అజిత్ అగార్కర్, బౌలింగ్ కోచ్ మోర్కెల్‌లు ప్రాక్టీస్ సెషన్‌ను పరిశీలించారు. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు జిమ్ సెషన్‌లో కసరత్తులు చేశారు. శనివారం నుంచి మూడో టెస్టు ఆరంభం కానుండగా.. నేడు భారత జట్టు బ్రిస్బేన్‌కు వెళ్లనుంది!.

షమి వస్తాడా?!

స్టార్ పేసర్ మహ్మద్ షమి ఆస్ట్రేలియాతో టెస్టులకు వస్తాడా? అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత చీలమండ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న షమి.. రిహాబిలిటేషన్ ముగించుకుని దేశవాళీ క్రికెట్‌లో రీ ఎంట్రీ ఇచ్చాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో బెంగాల్ తరఫున ఆల్‌రౌండ్ షోతో మెప్పించాడు. దీంతో చివరి మూడు టెస్టులకు మహ్మద్ షమి జట్టులోకి వస్తాడనే అంచనాలను ఎక్కువయ్యాయి. ఆడిలైడ్ టెస్టులో బుమ్రాకు సరైన జోడీ కరువైంది. దీంతో షమిపై అందరి ఫోకస్ నెలకొంది. 'షమి జట్టులోకి వచ్చి ఆడేందుకు తలుపులు తెరిచే ఉంటాయి.

కానీ దేశవాళీ మ్యాచ్‌లో షమి గాయానికి వాపు వచ్చింది. కాస్త నొప్పి కూడా ఉన్నట్టు తెలిసింది. వైద్య నిపుణులు షమి ఫిట్‌నెస్‌ను పర్యవేక్షిస్తున్నారు. అతడిపై ఎటువంటి ఒత్తిడి పెట్టాలని అనుకోవటం లేదు. వైద్య బృందం క్లియరెన్స్ లభిస్తే షమి రాకకు సర్వం సిద్ధంగా ఉంది' అని రోహిత్ శర్మ అన్నాడు.

# రోహిత్ కు పరీక్ష కాలం



బ్రిస్బేన్: బోర్డర్‌గవాస్కర్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్టులో టీమిండియా పది వికెట్ల తేడాతో ఘోర పరాజయం చవిచూసిన సంగతి తెలిసిందే. ఇలాంటి స్థితిలో మిగిలిన మూడు టెస్టు మ్యాచ్‌లు భారత జట్టుకు చావోరేవోగా మారింది. బుమ్రా సారథ్యంలో మొదటి టెస్టులో బరిలోకి దిగిన టీమిండియా చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. కానీ రోహిత్ కెప్టెన్సీలో అడిలైడ్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం చవిచూసింది. జట్టు ను ముందుండి నడిపించడంలో రోహిత్ పూర్తి గా విఫలమయ్యాడు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా జట్టుపై ఏమాత్రం ప్రభావం చూపలేక పోయాడు.


జట్టు ఓటమికి రోహిత్ పేలవమైన కెప్టెన్సీనే కారణమని భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇం గ్లండ్ తదితర దేశాలకు చెందిన మాజీ క్రికెటర్లు దుమ్మెత్తి పోస్తున్నారు. రోహిత్ కెప్టెన్సీలో పసలేదని, అతను సారథిగా పనికిరాడని అతన్ని తప్పిస్తేనే జట్టుకు మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇంతకుముందు న్యూజిలాండ్‌తో సొంత గడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌లోనూ రోహిత్ కెప్టెన్‌గా ఘోరంగా విఫలమైన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.

అతని సా రథ్యంలో భారత్ ఎప్పుడూ లేని విధంగా న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైందని ఆరోపిస్తున్నారు. ఇదిలావుంటే బోర్డర్‌గవాస్కర్ సిరీస్‌లో మిగిలిన మూడు టెస్టు మ్యాచ్‌లు రోహిత్‌కు సవాల్‌గా మారాయి. బ్యాటర్‌గా, కెప్టెన్‌గా జ ట్టుకు అండగా నిలువాల్సిన పరిస్థితి అతనికి నెలకొంది. భవిష్యత్తులో సారథ్యాన్ని నిలబెట్టుకోవాలంటే బోర్డర్‌గవాస్కర్ సిరీస్‌లో భారత్‌ను విజేతగా నిలుపడం తప్పించి రోహిత్‌కు మరో మార్గం కనిపించడం లేదు. రెండో టెస్టు లో రోహిత్ బ్యాటర్‌గా పూర్తిగా తేలిపోయాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ సింగిల్ డిజిట్ స్కోరు కే పెవిలియన్ చేరాడు.

ఈ పరిస్థితుల్లో రానున్న మ్యాచ్‌లు రోహిత్ బ్యాటింగ్‌కు పరీక్షగా మారనున్నాయి. జట్టును ముందుండి నడిపించాల్సిన బాధ్యత అతనిపై ఉంది. ఇందులో అతను ఎంత వరకు సఫలం అవుతాడనే దానిపైనే టీమిండియా గెలుపు ఓటములు ఆధారపడి ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు. దీంతో రానున్న టెస్టుల్లో అందరి దృష్టి రోహిత్‌పైనే నిలవడం ఖాయం. ఇక తీవ్ర ఒత్తిడిలో ఉన్న రోహిత్ జట్టును ఎలా నడిపిస్తాడో వేచి చూడాల్సిందే.

# ఆటలో ఇలాంటివి సహజమే

**భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి**



ముంబై: ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో ఆ స్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ పట్ల టీమిండి యా ఫాస్ట్ బౌలర్ సిరాజ్ ప్రవర్తించిన తీరుపై సర్వ త్రా విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. సిరా జ్ తీరును భారత్‌తో పాటు మాజీ విదేశీ క్రికెటర్లు తీవ్రంగా తప్పుపట్టారు. అయితే భారత మాజీ ప్ర ధాన కోచ్ రవిశాస్త్రి మాత్రం సిరాజ్‌కు అండగా ని లిచాడు. హెడ్‌పై సిరాజ్ ప్రవర్తించిన తీరును తప్పు పట్టాల్సిన అవసరం లేదన్నాడు. ఏ ఫాస్ట్ బౌలర్‌కై నా ఇలాంటి టెంపర్‌మెంట్ సహజమన్నాడు. తా ము ఆడే రోజుల్లో కూడా ఇలాంటి సంఘటనలు తరచు జరిగేవన్నాడు. దీన్ని అప్పట్లో ఎవరూ పెద్ద గా పట్టించుకునే వారు కాదన్నాడు. సిరాజ్ పెద్ద తప్పు ఏమీ చేయలేదన్నాడు. ఫాస్ట్ బౌలర్లు ఇలా ప్రవర్తించడం ఆటలో భాగమేనన్నాడు. ఇక ఆస్ట్రేలియాతో జరిగే మిగిలిన టెస్టుల్లో ఇలాంటి సంఘటనలు మరిన్ని తలెత్తడం ఖాయమన్నాడు. మరోవైపు ఇకపై జరిగే మ్యాచుల్లో భారత క్రికెటర్లు మైదానంలో మరింత దూకుడుగా ఉండాలన్నాడు. కసితో ముందుకు సాగాలన్నాడు. ఆస్ట్రేలియా ఆ టగాళ్ల సవాళ్లకు దీ టుగా బదులి వ్వాలన్నాడు. అప్పుడే జట్టుకు గెలు పు అవకాశాలు మెరుగ్గా ఉంటాయని రవిశాస్త్రి పేర్కొన్నాడు.

# భారత్ టార్గెట్ 299 పరుగులు..




హైదరాబాద్: ఆస్ట్రేలియాతో జరిగిన మూడో లేదా చివరి వన్డే మ్యాచ్ లో భారత మహిళా జట్టుకు 299 పరుగుల లక్ష్యం నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. అన్నాబెల్ సదర్లాండ్ (110) సెంచరీ సాధించగా, కెప్టెన్ తహ్లియా మెక్‌గ్రాత్ (56 లి), ఆష్లే గార్డెనర్ (50) అర్ధ శతకాలతో మెరిశారు. భారత బౌలర్లలో అరుంధతి రెడ్డి 4, దీప్తి శర్మ ఒక వికెట్ తీశారు. ఇప్పటికే మూడు వన్డేల సిరీస్‌ను 2-0 తేడాతో ఆసీస్ కైవసం చేసుకున్న విషయం విదితమే. టాస్ నెగ్గిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. ఆసీస్ ఓపెనర్లు ఫోయిబ్ లిచ్‌ఫీల్డ్ (25), జార్జియా వోల్ (26) దూకుడుగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. తొలి వికెట్‌కు 58 పరుగులు జోడించారు. ఈ సమయంలో విజఅంభించిన అరుంధతి రెడ్డి తొలి నలుగురు బ్యాటర్లను అవుట్ చేసింది. దీంతో ఒక్కసారిగా 78/4 స్కోరుకు ఆసీస్ పడిపోయింది. అయితే, ఆ తర్వాత భారత బౌలర్లు పట్టువదిలేశారు. గార్డెనర్‌తో కలిసి అన్నాబెల్ 96 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టింది. ఆ తర్వాత కెప్టెన్ తహ్లియా %-% అన్నాబెల్ జోడీ ఆరో వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. చివరి ఓవర్‌లో అన్నాబెల్ రనౌట్ రూపంలో పెవిలియన్‌కు చేరింది. లేకపోతే మరోసారి ఆసీస్ 300 మార్క్‌ను తాకేది.

# గోల్డెన్ డకౌట్. డైమండ్ డకౌట్ అంటే ఏమిటి?




హైదరాబాద్: క్రికెట్ పరి భాషలో ఎదుర్కొన తొలి బంతికే పరుగులేమీ చేయకుండా ఔట్ అయితే గోల్డెన్ డకౌట్ అంటారు. పరుగులేమీ చేయకుండా రెండో బంతికి ఔట్ అయితే సిల్వర్ డక్, మూడో బంతికి ఔట్ అయితే బ్రాంజ్ డకౌట్ అంటారు. ఒక్క బంతిని కూడా ఎదుర్కోకుండా రనౌట్ రూపంలో ఔట్ అయితే డైమండ్ డకౌంట్ అంటారు. ఇండియా -ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న రెండో టెస్టులో యశస్వి జైస్వాల్ ఎదుర్కొన్న తొలి బంతికే ఔట్ కావడంతో గోల్డెన్ డకౌట్ తెరపైకి వచ్చింది.

శ్రీలంక స్పిన్ బౌలర్ మురళీధరన్ 14 సార్లు గోల్డెన్ డకౌట్ రూపంలో రికార్డు సృష్టించారు. లషిత్ మలింగా(13), దినేష్ కార్తీక్(17), రోహిత్ శర్మ(16) సార్లు డకౌట్ రూపంలో మైదానం వీడారు. శ్రీలంక బౌలర్ ముత్తయి మురళీధరన్ 59 సార్లు డకౌట్ రూపంలో ఔటై తొలి స్థానంలో ఉండగా వాల్ష్ కూడా 54 సార్లు డకౌట్ అయి రెండో స్థానంలో ఉన్నారు. భారత్ నుంచి బౌలర్ జహీర్ ఖాన్(44), ఇషాంత్ శర్మ(40), విరాట్ కోహ్లీ(38), హర్భజన్ సింగ్(37), అనిల్ కుంబ్లే(35), రోహిత్ శర్మ(34), సచిన్ టెండూల్కర్(34) సార్లు డకౌట్ రూపంలో వెనుదిరిగారు.

# బాక్సింగ్ డే టెస్టుకు ఫుల్ డిమాండ్

హాట్ కేకుల్లా అమ్ముడు పోయిన టికెట్లు



మెల్‌బోర్న్: భారత్‌ఆస్ట్రేలియా జట్ల మధ్య డిసెంబర్ 26 నుంచి జరిగే బాక్సింగ్ డే టెస్టు మ్యాచ్‌కు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్‌బోర్న్ వేదికగా నాలుగో టెస్టు మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌కు 15 రోజుల సమయం ఉన్నప్పటికీ తొలి రోజుకు సంబంధించిన టికెట్లలన్నీ హాట్ కేకుల్లా అమ్ముడు పోయా యి. మొదటి రోజు ఆటకు సంబం ధించిన టికెట్లను విక్రయానికి పెట్టగా గంటల వ్యవధిలోనే అన్ని అమ్ముడై పోయా యి.

ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలి యా ట్విటర్‌లో వెల్లడించింది. సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు రెండు టెస్టులు జరిగాయి. తొలి టెస్టులో టీమిండియా విజయం సాధించగా, అడిలైడ్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జ యకేతనం ఎగుర వేసింది. రెండో టెస్టు మ్యాచ్ డేనైట్ పద్ధతిలో నిర్వహించారు. ఈ మ్యాచ్ మూడు రోజుల్లోనూ ముగిసింది ఈ మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో 1,35,012 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. కాగా, రెండు జట్ల మధ్య మూడో టెస్టు మ్యాచ్ డిసెంబర్ 14 నుంచి బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియంలో జరుగనుంది.

# ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్.. టాప్-30 నుంచి రోహిత్ శర్మ ఔట్

ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో భారత బ్యాటర్లు స్కోర్లు చేయడం లేదు. ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అంచనాలకు తగ్గట్లు ఆడట్లేదు. దీంతో ఈ ప్రభావం వారి ఐసీసీ ర్యాంకులపై పడింది. తాజాగా విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ టాప్-30లో కూడా నిలవలేదు. భారత కెప్టెన్ ఆరు స్థానాలు దిగజారి 31వ స్థానానికి పరిమితమయ్యాడు. కోహ్లీ ఐదు స్థానాలు డౌన్ అయి 20వ ర్యాంకులో నిలిచాడు. యశస్వి జైస్వాల్ నాలుగో ప్లేస్‌లో కొనసాగుతుండగా.. రిషభ్ పంత్ మూడు స్థానాలు కోల్పోయి 9వ ర్యాంకుకు పడిపోయాడు. శుభ్‌మన్ గిల్ మాత్రం ఒక స్థానం మెరుగై 17వ ర్యాంకులో నిలిచాడు. నితీశ్ కుమార్ రెడ్డి ఆరు స్థానాలు ఎగబాకి 69వ స్థానం దక్కించుకున్నాడు.

ఇంగ్లాండ్ యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (898).. ఒక్క పాయింట్ తేడాతో జో రూట్ (897)ను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. భారత్‌తో పింక్ టెస్టులో భారీ శతకం బాదిన ఆసీస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ టాప్-10లోకి వచ్చాడు. అతను ఆరు స్థానాలు ఎగబాకి ఐదో స్థానంలో నిలిచాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**